అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

రైతులకు మంత్రి సవిత భరోసా

నీర్జాంపల్లి, గొడ్డుమర్రిలో పర్యటన

దెబ్బతిన్న అరటి తోటల పరిశీలన

అనంతపురం టౌన్/యల్లనూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వర్షాలకు పంట దెబ్బతిన్నందుకు రైతులెవరూ అధైర్యపడొద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. యల్లనూరు మండలం నీర్జాంపల్లి, గొడ్డుమర్రి గ్రామాల పరిధిలో వడగండ్ల వానకు దెబ్బతిన్న పండ్ల తోటలను ఆమె సోమవారం పరిశీలించారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తదితరులు మంత్రి వెంట ఉన్నారు. పలువురు రైతులు మంత్రి, ఎమ్మెల్యే ఎదుట కన్నీటిపర్యంతమయ్యారు. చేతికి వచ్చిన పంట దెబ్బతినడంతో రైతుల బాధ వర్ణనాతీతంగా ఉందని మంత్రి మీడియాతో అన్నారు. అకాల వర్షాలతో కడప, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 1,547 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని తెలిపారు. మొత్తం 1,240 మంది రైతులు రూ.60 కోట్ల వరకు నష్టపోయారని తెలిపారు. హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులు నివేదికను తయారుచేస్తున్నారని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని అన్నారు. హెక్టారుకు రూ.35 వేలు ఇన్‌పుట్ సబ్సిడీ, ఎంఐడీహెచ్ పథకం కింద ఒక్కొక్క రైతుకు హెక్టారుకు రూ.70 వేలు ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. రైతులు ఆత్మహత్యల జోలికి వెళ్లవద్దని

(తరువాయి 7లో)



యల్లనూరు మండలం నీర్జాంపల్లిలో నేలకొరిగిన అరటి పంటను పరిశీలిస్తున్న మంత్రి సవిత



మహిళా రైతులను ఓదారుస్తున్న శింగనమల ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

పంట నష్టంపై నివేదికలివ్వండి : ఇన్‌చార్జ్ కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల వల్ల జిల్లాలో జరిగిన పంటనష్టాన్ని పరిశీలించి వెంటనే నివేదికలను తయారు చేయాలని అధికారులను ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక సందర్భంగా ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం కురిసిన అకాల వర్షాలకు అనేక మండలాలలో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పంట నష్టపోయిన ప్రతిరైతును ఆదుకుంటామని భరోసా ఇచ్చారని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాల అంచనాలను వెంటనే తయారుచేసి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. అవసరమైన చోట ఇతర శాఖల అధికారులు, సిబ్బందిని వినియోగించుకోవాలని సూచించారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి ● న్యాయవాదులకు శిక్షణ



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి

అనంతపురం క్రైం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా పెండింగ్‌లోని కేసులను పరిష్కరించుకోవడం సులభమవుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ అన్నారు. సోమవారం జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ సూచనల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉమ్మడి జిల్లాలకు చెందిన దాదాపు 33 మంది న్యాయవాదులు, ఒక సోషల్‌వర్కర్, రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జ్యుడీషియల్ ఆఫీసర్‌కు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రీసోర్స్ పర్సన్‌గా బెంగళూరుకు చెందిన సీనియర్ ట్రైనర్ బృందకుమార్, పొటెన్షియల్ ట్రైనర్ కుమార్ తొలి రోజు శిక్షణకు హాజరైన వారికి వివిధ అంశాలపై మధ్యవర్తిత్వంలో ఉన్న వివరాలను తెలియజేశారు. ఈనెల 28వతేదీ వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల్లో సాధ్యమైనంతవరకు మధ్యవర్తిత్వం ద్వారా ఇరు పక్షాలకు న్యాయం జరిగే విధంగా పరిష్కరించే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

గణిత పరీక్షకు 564 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మార్చి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి గణిత పరీక్షకు రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు 564 మంది గైర్హాజరయ్యారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా 135 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. రెగ్యులర్ విద్యార్థులు 30,976 మందికిగాను 30,520 మంది పరీక్ష రాయగా.. 456 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 1132 మందికిగాను 1024 మంది పరీక్ష రాయగా.. 108 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ పరీక్షల్లో గణితం, ఐసీహెచ్ పరీక్షలు నిర్వహించారు. ఓపెన్‌లో 1044 మందికిగాను 848 మంది హాజరుకాగా.. 196 మంది గైర్హాజరయ్యారు. సిట్టింగ్ స్క్వాడ్ 30 కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ 7 కేంద్రాలను తనిఖీ చేశారు.

సర్వం అతడే..!

వీఆర్ఏ టు వాచ్‌మన్ వయా దఫేదార్



అనంతపురం క్రైం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో కావాల్సింది అతనేం చేస్తున్నాడని కాదు. అతడికి ఏమి తెలుసని. కీలకమైన ఆర్డీఓ కార్యాలయంలో ఓ ఉద్యోగి అదే పట్టుకున్నాడు. ఉన్నతాధికారుల అండదండలతో అర్హత లేకపోయినా ఆఫీస్‌లో అడుగుపెట్టాడు. ఆ శాఖలో అతనో వీఆర్ఏ(విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్). కీలకమైన రెవెన్యూ శాఖలో కింది స్థాయి పోస్టు. తన కంటే ఎంతో మంది సీనియర్లున్నా వారందరినీ పక్కకు నెట్టుకుంటూ వచ్చాడు. గార్లదిన్నె మండలానికి చెందిన ఈ వీఆర్ఏ అప్పట్లో ఆర్డీఓ కార్యాలయంలోని ఓ ఉన్నతాధికారి సహాయంతో వాచ్‌మన్‌గా అడ్డదారిలో ఆర్డర్ పొందాడు. అలా ఆర్డీఓ కార్యాలయానికి నైట్ వాచ్‌మెన్‌గా వచ్చాడు. సీనియర్ వీఆర్ఏలను పక్కన పెట్టి అతడికి అలా పోస్టింగ్ ఇచ్చారు. అప్పుడిచ్చిన ఆ ఆర్డర్స్ కూడా ఇప్పుడు ఆ కార్యాలయంలో లేవని సమాచారం. నైట్ వాచ్‌మన్‌గా ఉండాల్సిన అతను కొన్ని సంవత్సరాలు పగలు సమయంలోనూ ఆర్డీఓ కార్యాలయంలో తిరుగుతూ పరిచయాలు పెంచుకుంటూ వచ్చాడు. ఆ తరువాత దఫేదార్ అవతారమెత్తాడు. ఇక్కడా అడ్డదోవే. అటెండర్ అర్హత ఉన్నవారు మాత్రమే దఫేదార్‌గా ఉండాలి. నైట్‌వాచ్‌మన్‌లు దఫేదార్‌కు అనర్హులు. కానీ ఇతను దఫేదార్‌గా వచ్చేశాడు. గత కొన్నేళ్లుగా ఆర్డీఓ కార్యాలయంలో పని చేస్తుండటంతో అక్కడ చాలా మంది అధికారులకు తలలో నాలుకలా వ్యవహరించాడు. అడ్డదారిలో అక్కడికి వచ్చిన అతను డబ్బు సంపాదనలో బాగా బిజీ అయ్యాడు. అనంతపురం డివిజన్ పరిధిలో 14 మండలాలున్నాయి. ఈ క్రమంలో ఆర్డీఓ కార్యాలయంలోకి తహసీల్దార్ కార్యాలయాల నుంచి ఎన్నో ఫైళ్లు వస్తుంటాయి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల నుంచి ల్యాండ్ కన్వర్షన్ వరకు, అడంగల్‌లో పేరు మార్పు నుంచి నుంచి ఆర్వోఆర్ అప్పీల్ వరకు ప్రతి ఫైల్ విషయంలోనూ పైసలే మాట్లాడతాయని సమాచారం. చిన్న చిన్న పనులు అక్కడిసిబ్బంది చేసిపెట్టినా ఇతనే వసూలు చేసుకుంటాడని సమాచారం. ల్యాండ్ అక్విజేషన్, సీనియర్ సిటిజన్ ఫైళ్ల తదితర ఫైళ్ల విషయంలోనూ తల దూరుస్తుంటాడని తెలిసింది. ఆ కార్యాలయంలో ఉండాల్సిన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఓ)పోస్టు ఖాళీగా ఉండటంతో ఫైళ్లు ఉన్నతాధికారికి తీసుకెళ్లే విషయంలో ఇష్టారాజ్యంగా మారింది.

ఉన్న లొసుగులు, ఆఫీస్‌కు వచ్చే ఫైళ్ల విషయంలో జరిగే వ్యవహారాలలో ఆరితేరాడు. దీనికి తోడు అసోసియేషన్‌లో కొందరి సహకారంతో ఎదురులేకుండా చేసుకున్నాడు. ఆ కార్యాలయంలో అంతా తానై వ్యవహరిస్తున్నాడు. డబ్బులొచ్చే ఫైళ్లనే అతను టార్గెట్‌గా చేసుకుంటాడు. ఇప్పటికీ సీనియర్ వీఆర్వోలకు అతడంటే భయం. వారి నుంచి కూడా పైసలు వసూలు చేస్తాడట.

కీలక ఫైళ్ల విషయంలో ఆ శాఖలో కొందరు అధికారులు, ఉద్యోగులు ద్వారా వ్యవహారం నడుపుతుంటాడట. అంటే సంబంధిత ఫైళ్ల నుంచి వచ్చే ముడుపుల్లో వారికి కొంత ముట్టజెప్పి, తానూ తన జేబులోకి వేసుకోవడమన్నమాట. ఫైళ్ల విషయంలో ఆలస్యమైతే ఆఫీస్ సిబ్బందిపై ఒత్తిడి కూడా చేస్తాడట. మహిళా ఉద్యోగులను ఏకవచనంతో పిలుస్తాడని, ఏమైనా అంటే అసోసియేషన్ మద్దతు తనకుందంటూ చెప్పుకుంటాడట. దీంతో ఆఫీస్ సిబ్బంది గప్‌చుప్‌గా ఉంటున్నట్లు సమాచారం.

అడ్డగోలుగా ఆఫీస్‌లోకి..

అడ్డదారిలో ఆర్డీఓ కార్యాలయంలోకి
పైసలొచ్చే కీలక ఫైళ్ల విషయంలోనే జోక్యం
ఓ చిరుద్యోగి 'పెద్ద' పనులు

పైసలొచ్చే ఫైళ్లన్నీ అతడి ద్వారానే..

హౌసింగ్ సర్వేలో జిల్లా ఫస్ట్

పీడీ శైలజ



లబ్ధిదారుల సర్వేలో హౌసింగ్ పీడీ శైలజ, ఇంజనీర్లు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): హౌసింగ్ లబ్ధిదారుల సర్వేలో జిల్లాకు ప్రథమ స్థానం దక్కింది. ఈనెల 19 నుంచి 23వ తేదీలోపు జిల్లా వ్యాప్తంగా ఉన్న లబ్ధిదారుల సర్వే చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం హౌసింగ్ అధికారులను ఆదేశించింది. జిల్లా వ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలు 16389మందికి గాను 15438మంది లబ్ధిదారుల సర్వే పూర్తి చేసి అంగీకారపత్రం సేకరించారు. జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వంలో ఇళ్లు మంజూరై వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న లబ్ధిదారులకు అదనంగా నిధులు చెల్లించి పూర్తి చేసుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. గత ప్రభుత్వం చెల్లించిన మొత్తంతో పాటు బీసీ, ఎస్సీలకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75వేలు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని హౌసింగ్ పీడీ శైలజ తెలిపారు. ఇంజనీర్లు, సిబ్బంది, ఆయా మండల ఎంపీడీఓలు, మున్సిపాలిటీల కమిషనర్ల సమష్టి కృషితోనే సర్వేలో జిల్లాకు రాష్ట్రంలోనే ప్రథమ స్థానం దక్కిందన్నారు.

మద్యం సిండికేట్ వివాదం.. ఘర్షణ

మాజీ ఎంపీపీ కోనా ఇంటిపై రాళ్ల దాడి





రాళ్లదాడిలో పగిలిపోయిన ఇంటి అద్దాలు.. ధ్వంసమైన కారు అద్దాలు

గుత్తి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మద్యం సిండికేటుదారుల మధ్య సోమవారం రాత్రి ఘర్షణ జరిగింది. దీంతో గుత్తి మాజీ ఎంపీపీ కోనా మురళీధర్ రెడ్డి ఇంటిపై దాడి జరిగింది. వివరాలు ఇలా.. మద్యంషాపులు, బార్ అండ్ రెస్టారెంట్‌ల ఆర్థిక లావాదేవీల గురించి చర్చించుకోవడానికి మద్యం సిండికేటుదారులు పట్టణ శివారులోని ఓ హోటల్‌లో సోమవారం సమావేశం అయ్యారు. ఇటీవల ఓ కొత్త షాపు రావడంతో ప్రస్తుతం నష్టాల్లో నడుస్తున్న మద్యం దుకాణాలను కలిసి సిండికేటుగా వ్యవహరించాలన్నారు. దీనికి కొంత మంది ఒప్పుకోలేదు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఈ సమావేశానికి మాజీ ఎంపీపీ కోనా తన అనుచరులతో వచ్చారు. సిండికేటుదారులో ఉన్న ప్రతాప్‌తోపాటు మరికొంత మంది దీన్ని జీర్ణించుకోలేకపోయారు. ఈక్రమంలో ఎవరెవరో ఎదేదో మాట్లాడటంతో ఘర్షణ జరిగింది. సీఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో ఆ హోటల్‌కు చేరుకుని రెండు వర్గాలకు నచ్చజెప్పి మాజీ ఎంపీపీని అక్కడ నుంచి పంపించి వేశారు. ఇంతలోనే మాజీ ఎంపీపీ ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేసి, ఇంటి అద్దాలతో పాటు ఇంటి ఆవరణలో ఉన్న కారు అద్దాలను ధ్వంసం చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. దాడికి పాల్పడిన వారిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు.

నేడే ఆంధ్రజ్యోతి లక్కీ డ్రా | 6లో

ఖాద్రీశుడి హుండీ ఆదాయం

రూ.82.64 లక్షలు

క్షయ రహిత జిల్లాగా మారుద్దాం

జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఈబీ దేవి పిలుపు



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా వైద్యాధికారి తదితరులు

అనంతపురం టౌన్, మార్చి24(ఆంధ్రజ్యోతి): క్షయ రహిత జిల్లాగా అనంతను మారుద్దామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఈబీ దేవి పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ నివారణ దినం సందర్భంగా సోమవారం జిల్లాకేంద్రంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించింది. జిల్లా వైద్యాధికారి పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయం నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగించారు. జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ.. క్షయ నివారణకు ఇంటింటా సర్వే చేపడుతూ బాధితులను గుర్తించి, ఉచితంగా చికిత్సలు, మందులు అందిస్తున్నామన్నారు. డాక్టర్ల సూచనల మేరకు మందులు వాడితే క్షయ నయమవుతుందని సూచించారు. అనంతరం ఐఎంఏ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు క్షయ పీడితులకు దాతల సహకారంతో పౌష్టికాహారం, ఆర్థికసాయం అందజేశారు. క్షయ నివారణలో మెరుగైన పనితీరు కనబరచిన వైద్యసిబ్బందికి ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్, వైద్యులు మురళీకృష్ణ, శ్రీనాథ్, అభిషేక్ రెడ్డి, రవి శ్రీనివాస్, సుధీంద్ర, అంజనీకుమార్, డెమోలు త్యాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

వేరుశనగ కొనేదెవరు..?

మార్కెట్ లేక అన్నదాతకు అవస్థలు

కర్ణాటక మార్కెట్‌కు తరలించి అమ్మకం

రైతులు నష్టపోతున్నా పట్టించుకోని అధికారులు



పొలంలోనే ఆరబోసిన విత్తన వేరుశనగ

కళ్యాణదుర్గం/కుందుర్పి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వేరుశనగ రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో కర్ణాటకకు తీసుకెళ్లి అమ్ముకోవాల్సి వస్తోంది. ఇక్కడ విక్రయించాలంటే దళారులే దిక్కు. వారి చేతిలో మోసపోలేక సుమారు 100 కి.మీ. దూరంలో ఉన్న కర్ణాటక మార్కెట్‌లకు తరలిచేందుకు అవస్థలు పడుతున్నారు. విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదు. కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ మండలాల రైతులు స్థానికంగా మార్కెట్‌లేక కర్ణాటకకు వెళుతున్నారు. వారంలో రెండు రోజులు సోమ, శుక్రవారాల్లో మాత్రమే అక్కడ మార్కెట్‌ను నిర్వహిస్తున్నారు. రైతుల సమక్షంలో వేలం పాట నిర్వహించి, వెంటనే నగదు చెల్లిస్తారు. రబీలో నియోజకవర్గంలో 12,500 ఎకరాల్లో బోరు బావుల కింద విత్తన వేరుశనగను సాగు చేశారు. ఇక్కడి దిగుబడులను ఇక్కడే కొనుగోలు చేస్తే రైతులకు వ్యయ ప్రయాసలు తగ్గుతాయి. కర్ణాటక మార్కెట్‌లో కే-6 రకం క్వింటం ధర రూ.5 వేల నుంచి రూ.7,500 వరకు పలుకుతోంది. కదిరి -1 రకం రూ.5,500 నుంచి రూ.6 వేల వరకు పలుకుతోంది.



కొనేవారే లేరు

పది ఎకరాల్లో విడతల వారీగా వేరుశనగ సాగు చేశాను. మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో 50 క్వింటాళ్ల వేరుశనగను చెళ్లికెరకు తీసుకుపోయి అమ్మేశాను. అక్కడి మార్కెట్‌కు తరలించేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. కొన్నేళ్లుగా చెళ్లికెర మార్కెట్‌లోనే అమ్ముతున్నాం. ఇక్కడ వేరుశనగ కాయలు కొనే నాథుడే లేడు. స్థానికంగా కొనుగోలు చేస్తే మాకు ఖర్చులు తగ్గి, అంతో ఇంతో గిట్టుబాటు అవుతుంది.

- రామాంజనేయులు, కరిగానిపల్లి, కుందుర్పి మండలం



నరకయాతన..

నాకు 20 ఎకరాల పొలం ఉంది. పది ఎకరాల్లో వేరుశనగను సాగు చేశాను. పంట బాగానే వచ్చింది. వేరుశనగ కాయలను అమ్ముకోవడానికి నరకయాతన పడుతున్నాం. ప్రతి ఏటా ఇదే పరిస్థితి నెలకొంది. చెళ్లికెర మార్కెట్‌కు తరలించేందుకు రవాణా ఖర్చులు భారంగా మారాయి. ప్రభుత్వం స్పందించి, స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పించాలి.

- పెద్దన్న, మాయదార్లపల్లి, కుందుర్పి మండలం



మార్కెట్ సౌకర్యం కల్పించాలి

నేను ఐదెకరాల్లో వేరుశనగ సాగుచేశాను. దిగుబడిని చెళ్లికెర మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముకొచ్చాను. స్థానికంగా మార్కెట్ సౌకర్యం ఉంటే ఇబ్బందులు తప్పేవి. రానుపోను ఖర్చులు, బాడుగులు తడిసి మోపెడవుతున్నాయి. ప్రభుత్వం స్పందించి మార్కెట్ సౌకర్యం కల్పించాలి. స్థానికంగానే వేరుశనగ కాయలు కొనుగోలు చేయాలి.

- నాగరాజు, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.33 (మంగళవారం సాయంత్రం)
సెహరీ : 5.04 (బుధవారం ఉదయం)



కర్రల సాయంతో విద్యుత్ తీగలను ఎత్తి ట్రాక్టర్‌తో దుక్కి చేస్తున్న రైతులు

చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు

సేద్యం చేయాలంటే అవస్థలు

విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం

రైతులకు అవస్థలు

విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో రైతులు అవస్థలు పడుతున్నారు. విడపనకల్లు మండలంలోని గడేకల్లు, కడదరబెంచి గ్రామాల మధ్యలోని పొలాల్లో విద్యుత్ తీగలు నేలకు తాకే ఎత్తులో ఉన్నాయని, సేద్యాలు చేయటానికి ఇబ్బందిగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడేకల్లు గ్రామానికి చెందిన రైతులు పొలాల్లో దుక్కి చేసుకోవటానికి ఇబ్బంది పడుతున్నారు. అంజినయ్య, భీమలింగప్ప పొలాల్లో విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉన్నాయి. దుక్కి దున్నుతున్న సమయంలో ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగిలే ప్రమాదం ఉండడంతో రైతులు ముందు జాగ్రత్తగా కర్రల సాయంతో వాటిని పైకి ఎత్తి పట్టుకుంటున్నారు. పొలంలో సేద్యం చేయాలంటే ప్రస్తుతం ముగ్గురు కూలీలు అవసరమవుతారని రైతులు అంటున్నారు. విద్యుత్ తీగలను కర్రలతో పైకి ఎత్తిపట్టుకోవటానికి ఇద్దరు, ట్రాక్టర్ వెనుక ఒకరు ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు. వెంటనే వేలాడుతున్న విద్యుత్ తీగలను మరమ్మతులు చేసి ఇబ్బందులు లేకుండా చేయాలని కోరుతున్నారు.

– ఆంధ్రజ్యోతి, విడపనకల్లు



గడేకల్లు వద్ద పొలంలో చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు

హంద్రీనీవాకు 29 టీఎంసీలు



హంద్రీనీవా కాలువలో ఆగిపోయిన నీటి ప్రవాహం

గుంతకల్లు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవాలో గత మూడేళ్లతో పోలిస్తే ఈ సంవత్సరం అధిక మోతాదులో నీటి ఎత్తిపోతలు జరిగాయి. వైసీపీ హయాంలో 2021-22 సీజన్ మినహా కనీసం 25 టీఎంసీల మార్కును దాటి నీటిని పారించలేకపోయారు. 2024-25 సీజన్‌లో గత వారం హంద్రీనీవాలో ఎత్తిపోతలు నిలిపేశారు. మొత్తంపై 28.9 టీఎంసీల నీటిని పంపుచేశారు. ప్రభుత్వం అనుకున్నట్టుగానే శ్రీశైలం డ్యాంలో ఇంకా తగినన్ని నీటి నిల్వలు ఉండగానే హంద్రీనీవాకు ఎత్తిపోతలను నిలిపివేశారు. దీంతో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన ఏడేళ్లలో తొలిసారిగా హంద్రీనీవాకు ఆ ప్రాజెక్టు నుంచి ప్రత్యామ్నాయంగా నీటిని తోడుకునే అవసరం లేకుండాపోయింది. హెచ్ఎన్ఎస్ఎస్‌లో 220 రోజులపాటు ఏకధాటిగా నీటిని ఎత్తిపోసినా ఈ సంవత్సరం 40 టీఎంసీల మ్యాజిక్ ఫిగర్‌ను చేరుకోలేకపోయారు.

శ్రీశైలం డ్యాంలో నీరున్నా..

సాధారణంగా శ్రీశైలం డ్యాంలో 835 అడుగుల స్థాయి వరకూ మల్యాల పంప్‌హౌస్ వద్ద హంద్రీనీవాలోకి నీటిని ఎత్తిపొయ్యడానికి సాధ్యపడుతుంది. 2017లో కేసీ కెనాల్ కోసం నిర్మించిన ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా 814 అడుగుల స్థాయి వరకూ నీటిని తోడుకోవచ్చు. ఈ కారణంగా మల్యాల పంపులు ఆగిన తర్వాత కూడా ముచ్చుమర్రి పంపుల ద్వారా కూడా హంద్రీనీవాకు నీటిని ఇవ్వడానికి ఆ ప్రాజెక్టును రూపకల్పన చేసి 2017లో చంద్రబాబు నాయుడు జల హారతి కార్యక్రమం కింద ప్రారంభించారు. అప్పటి నుంచి డ్యాంలో నీటి నిల్వలు తగ్గిపోయి మల్యాల పంపుహౌస్ పనిచేయకపోతే, ప్రత్యామ్నాయంగా ముచ్చుమర్రి పథకం ద్వారా హంద్రీనీవాకు తక్కువ మోతాదులో నీటిని పారించేవారు. అలా గడచిన ఏడేళ్లూ ముచ్చుమర్రి పథకం నుంచి హంద్రీనీవాకు నీటిని ఇచ్చారు. కానీ, ఈ సంవత్సరం డ్యాంలో తగినన్ని నీటి నిల్వలను ఉంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పంటలన్నింటికీ తుది తడులు పూర్తయిన వెంటనే హంద్రీనీవాకు ఎత్తిపోతలను నిలిపివేసింది. ప్రస్తుతం 837.4 అడుగుల నీటి నిల్వ ఉంది. ఇదివరకైతే 814 అడుగుల స్థాయి వరకూ నీటి ఎత్తిపోతలు జరిగేవి. దీర్ఘకాలిక పంటలైన కంది, మిర్చి పంటలు కూడా పూర్తికావడంతో ఇక సాగునీరు అక్కర్లేదని భావించి రైతుల సమ్మతితో హంద్రీనీవాకు పంపింగ్‌ను నిలిపివేశారు.

మూడేళ్లలో గరిష్ఠం

2024-25 సీజన్‌కు సంబంధించి గతవారం హంద్రీనీవా నుంచి జిల్లాకు నీటి ప్రవాహం నిలిచిపోయింది. మొత్తంపై 28.9 టీఎంసీల నీరు హంద్రీనీవాలో పారించారు. గడచిన మూడు సీజన్లతో పోలిస్తే ఎక్కువ స్థాయిలో పారించినట్లయింది. 2021-22 సీజన్‌లో హంద్రీనీవాలో 25.56 టీఎంసీలు నీరు పారగా, 2022-23 సంవత్సరంలో 23.7 టీఎంసీలు, 2023-24 సంవత్సరంలో 21.2 టీఎంసీలు మాత్ర మే పంపు చేయగలిగారు. ఈ లెక్కన 2020-21 సీజన్‌తో పోలిస్తే తర్వాతి సంవత్సరంలో 14.5 టీఎంసీలు, 2021-22 సంవత్సరంలో పోలిస్తే తదుపరి సంవత్సరం దాదాపు 2 టీఎంసీలు, 2022-23తో పోలిస్తే 2023-24 సీజన్‌లో హంద్రీనీవాకు రెండు టీఎంసీల నీటి కోత ఏర్పడింది. ఈ సంవత్సరం గత మూడేళ్ల రికార్డులు అధిగమించి 28.9 టీఎంసీలను నీటిని పారించారు. ఇందులో జిల్లాలోకి 24.5 టీఎంసీల నీరు వచ్చి ఎగువకు పారగా, కర్నూలు జిల్లాకు 4.4 టీఎంసీలు లభించాయి. ఇదిలా ఉండగా, హంద్రీనీవాకు నీరు నిలిచిన వెంటనే వెడల్పు పనులు చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్న కారణంగా ఏప్రిల్ వరకు నీటిని పారించే అవకాశం ఉన్నా ఎత్తిపోతలకు బ్రేక్ వేసినట్లు సమాచారం.



మండేకాలం.. జాగ్రత్త

వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం

ముందు జాగ్రత్త చర్యలు తప్పనిసరి

ధర్మవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చేసింది. ఎండలు మండిపోతున్నాయి. వాతావరణం అగ్ని సెగలా మారింది. ఇలాంటి స్థితిలో అగ్ని ప్రమాదాలు జరిగితే...! క్షణాల్లో సర్వం బుగ్గి అవుతుంది. ఆస్తి నష్టంతోపాటు ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంటుంది. అందుకే వేసవిలో ప్రజలు అగ్ని విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. ఎంతలేదనుకున్నా ఎండాకాలంలో ఎక్కడో ఒక చోట అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కొందరు పొగరాయుళ్ల బీడీ, సిగరెట్లను ఆర్పకుండా నిర్లక్ష్యంగా పారేయడం వల్ల కూడా కొన్ని ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. నిప్పుపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్ని మాపక కేంద్రం సిబ్బంది హెచ్చరిస్తున్నారు. ధర్మవరం అగ్నిమాపక కేంద్రంలో 15 మంది సిబ్బంది, ముగ్గురు హోంగార్డులు, ఒక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రం పరిధిలో ధర్మవరం, ధర్మవరం రూరల్, తాడిమర్రి, బత్తలపల్లి, సీకేపల్లి మండలాలు ఉన్నాయి. ఏడాదికాలంలో దాదాపు 60 అగ్నిప్రమాదాలు జరిగాయి. దాదాపు రూ.కోటికిపైగా నష్టం వాటిల్లినట్లు అధికారులు చెబుతున్నారు. ఐదు మండలాలకు ఒకే ఫైరింజన్ ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



ఆకతాయిలు చెత్తకు నిప్పుపెట్టడంతో చెలరేగిన మంటలు

తరచూ గడ్డివాముల దగ్ధం

గ్రామాల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న గడ్డివాములు ఎండాకాలంలో తరచూ అగ్ని ప్రమాదాలకు గురవుతుంటాయి. గడ్డివాముకు గడ్డివాముకు కనీస దూరం 10మీటర్లు ఉండేలా ఏర్పాటు చేసుకుంటే నష్టం తగ్గే అవకాశం ఉందని అగ్నిమాపక అధికారులు చెబుతున్నారు. కరెంటు తీగల కింద గడ్డివామును వేయకూడదు. పచ్చి గడ్డి, ఎండు గడ్డి కలిపి వామి వేయకూడదు. దీని వల్ల ఎండ వేడిమికి మంటలు చెలరేగే అవకాశాలు ఉంటాయి. గడ్డిని పూర్తిగా ఎండబెట్టిన తరువాతే వామి వేసుకోవాలి. గడ్డివాముల దగ్గర బీడీ, సిగరెట్లు వంటివి కాల్చరాదు. పొలాల్లో పంటలు చేతికొచ్చిన తరువాత మిగిలిన చెత్తకు రైతులు మంటలు పెట్టడం సర్వసాధారణం. అయితే ఆ మంటలు పూర్తిగా ఆరిపోయే వరకు అక్కడే ఉండటం వల్ల అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు.



గ్యాస్ సిలిండర్లు



అగ్ని మాపక వాహనం

- ప్రజలు ఎండాకాలంలో పెట్రోల్ బంకుల దగ్గర సెల్‌ఫోన్‌ల ఓ మాట్లాడటం చాలా ప్రమాదకరం. పెట్రోల్ బంకు యాజమాన్యం ఇసుక, మంటలను అదుపుచేసే డీసీపీ వంటి అన్ని రకాల సిలిండర్లను అందుబాటులో ఉంచుకోవాలి.
- కరెంటు ఓల్టేజీలో హెచ్చుతగ్గుల వల్ల ఇళ్లలోనే కాకుండా దుకాణం , పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎండకాలంలో ఎక్కువ కరెంటు వినియోగం వల్ల కూడా షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇళ్లు, దుకాణాల్లో తెగిపోయిన పాత వైర్లు, పాత బడిన స్విచ్‌లు, బోర్డులంటే వెంటనే వాటిని మార్చేయాలి. లేకపోతే వీటి వల్ల షార్ట్‌సర్క్యూట్ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.
- రాత్రి వేళ వంట పూర్తి అయిన తర్వాత తప్పకుండా గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలి. సిలిండర్‌కు ఐఎస్ఐ ముద్ర కల్గిన పైపును మాత్రమే వినియోగించాలి. రెండు రోజులు ఊరికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన తరువాత కిటికీ, తలుపులు పూర్తిగా తెరిచిన ఐదు నిమిషాల తర్వాతే కరెంటు స్విచ్‌లను ఉపయోగించాలి. సిలిండర్ నుంచి గ్యాస్ లీక్ అయితే భయపడకుండా దుప్పటి లేక ఏదో బట్ట సాయంతో సిలిండర్‌కు చుట్టి మంటను నివారించే ప్రయత్నం చేయాలి.

సహ పోరు బ్యాంకు..!

ఏడీసీసీకి నలుగురు సీఈఓలు?

వర్గాలుగా విడిపోయిన ఉద్యోగులు

స్తంభించిన కార్యకలాపాలు

ఇష్టారీతిన వ్యవహరిస్తున్న వైనం



జిల్లా సహకార కేంద్ర బ్యాంకు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కరువు రైతును ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన సహకార బ్యాంకు వర్గపోరుకు నిలయంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనంతపురం జిల్లా కేంద్ర సహకార (ఏడీసీసీ) బ్యాంకుకు నలుగురు సీఈఓలుగా వ్యవహరిస్తున్నారు. నమ్మడానికి విడ్డూరంగా ఉన్నా.. ఇది ముమ్మాటికీ వాస్తవమే. ప్రస్తుత సీఈఓతోపాటు గతంలో అదే హోదాలో పనిచేసిన ముగ్గురు ఇక్కడే పనిచేస్తున్నారు. వారు వర్గాలుగా విడిపోయి, పోరు సాగిస్తున్నారన్న చర్చ బ్యాంకు వర్గాల్లో వినిపిస్తోంది. గతంలో సీఈఓలుగా పనిచేసిన అధికారులు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లకుండా ఇక్కడే మాటు వేసుకుని కూర్చున్నారు. దీంతో బ్యాంకులో ఉద్యోగుల మధ్య విభేదాలు సృష్టించి, తమ ఉనికి కాపాడుకుంటున్నారని తెలుస్తోంది. బ్యాంకులో కింది భాగాన ఐటీ పేరుతో ఓ అధికారి, మొదటి అంతస్తులో రుణాల పేరుతో మరొకరు, రెండో అంతస్తులో అడ్మిన్ పేరుతో ఇంకొకరు ఇలా ముగ్గురు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సీఈఓ మొదటి అంతస్తులోని ప్రధాన శాఖలో ఉన్నారు. వారి తీరుతో బ్యాంకు తిరోగమనంలోకి వెళ్తోంది. గత ఐదేళ్లలో బ్యాంకును పూర్తిగా నిర్వీర్యం చేశారు. ప్రధాన కార్యాలయంలో మరో ఇద్దరు అధికారులు పదేళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నారు. దీంతో బ్యాంకు కార్యకలాపాలన్నీ వారి కనుసన్నల్లోనే సాగుతున్నాయన్న చర్చ వినిపిస్తోంది. స్టేషనరీ, ఫర్నీచర్ ఇతర సామగ్రి కొనుగోలు, క్యాలెండర్, డైరీల తయారీ ఇలా ప్రతి అంశంలోనూ కమీషన్లకు కక్కుర్తి పడి బ్యాంకుపై తీవ్ర ఆర్థికభారం మోపుతున్నారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.

విచారణాధికారి మార్పు

ఏడీసీసీ బ్యాంకు ఆత్మకూరు బ్రాంచ్ పరిధిలో 2015-16లో ఆరుగురు రైతులకు రూ.30 లక్షల వరకు రుణాలు ఇచ్చారు. వారివి అసైన్డ్ పట్టాలని తేల్చారు. తొమ్మిదేళ్లకుగాను మొత్తం వడ్డీతో కలిపి రూ.50 లక్షల వరకు చేరింది. ఈ రుణాల చెల్లింపులో ప్రధాన కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై విచారణ బాధ్యతను జిల్లా కేంద్రంలోని ఓ అధికారికి అప్పగించారు. విచారణ నివేదిక అందరినీ విస్తుగొలిపింది. విచారణకు ఎవరూ సహకరించడం లేదని నివేదిక సమర్పించినట్లు సమాచారం. విచారణాధికారి, అక్రమాల్లో పాలుపంచుకున్న అధికారి మధ్య సయోధ్య కుదరడంతోనే ఇలా నివేదిక ఇచ్చారనే విమర్శలు వినవస్తున్నాయి. తర్వాత జిల్లా సహాయ సహకార శాఖాధికారిని విచారణాధికారిగా నియమించారు. ఈయన ఏం చేస్తారోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



కిందిభాగంలోని ఐటీ విభాగం

చుట్టపు చూపుగా పర్సన్ ఇన్‌చార్జి

ఏడీసీసీ బ్యాంకు పాలకవర్గ పదవీకాలం ముగియడంతో జిల్లా జాయింట్ కలెక్టర్‌ను పర్సన్ ఇన్‌చార్జిగా ప్రభుత్వం నియమించింది. 9 నెలలుగా పర్సన్ ఇన్‌చార్జి కొనసాగుతున్నారు. బ్యాంకులో అంతులేని అవినీతి, అక్రమాలు జరుగుతున్నా.. పర్సన్ ఇన్‌చార్జి పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. సమావేశాల్లో రైతు రుణాల వడ్డీ రాయితీలో అక్రమాలు జరిగాయంటూ సహకార శాఖ అధికారులు ఆధారాలతో సమస్యను లేవనెత్తినా చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. నలుగురు అధికారులు విడిపోయి ఉద్యోగుల మధ్య చీలికలు తీసుకువచ్చినా... వారి మధ్య సమన్వయం కుదర్చడంలోనూ పర్సన్ ఇన్‌చార్జి చొరవ చూపలేకపోయారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

సమన్వయంతో పని చేయాలి

అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంది. బ్యాంకు, సొసైటీలు సంయుక్తంగా పురోగతి సాధనలో భాగస్వాములవ్వాలి. ఆత్మకూరు శాఖలో బోగస్ పట్టాలకు రుణాల ఆరోపణలపై మొదట విచారణ చేసిన నివేదిక సంతృప్తికరంగా లేదు. దీంతో డీఎల్‌సీఓను విచారణాధికారిగా నియమించాం. నివేదిక ఆధారంగా బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.



– అరుణకుమారి, జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ)

రేపటి వరకూ అభ్యంతరాల స్వీకరణ

అనంతపురం విద్య, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీచర్ల సీనియారిటీ జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే...ఈ నెల 26వ తేదీలోగా చెప్పాలని అనంతపురం డీఈఓ ప్రసాద్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ స్కూళ్లలో పని చేసే టీచర్ల సీనియారిటీ జాబితాను టెస్, డీఎస్సీల వారీగా మార్కులు, మెరిట్ ఆధారంగా రూపొందించామన్నారు. సీనియారిటీ జాబితాను అనంతపురం డీఈఓ బ్లాగ్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే... ఈనెల 26లోగా ఆధారాలతో అనంతపురం శారదానగర్‌లోని జిల్లా సైన్స్ సెంటర్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. గడువు తీరిన తర్వాత వచ్చే అభ్యంతరాలను స్వీకరించమని డీఈఓ స్పష్టం చేశారు.

సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ బదిలీ

అనంతపురం న్యూటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) అనంతపురం డివిజన్ సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ చంద్రశేఖర్ బదిలీ అయ్యారు. మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగంలో సుగంధ మొక్కల తయారీ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా డెప్యుటేషన్‌పై బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అజయ్‌కుమార్ నాయక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. టెరిటోరియల్ డీఎఫ్ఓ విఘ్నేష్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. సోషల్ ఫారెస్ట్ ద్వారా నర్సరీల అభివృద్ధికి నిదులు విడుదల కాకపోయిన ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిధులు సమకూర్చుకొని నర్సరీల అభివృద్ధికి పెద్ద ఎత్తున చర్యలు చేపట్టేలా గత వారంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి దిశ నిర్దేశం చేశారు. అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయి సిబ్బంది సైతం పనుల ప్రారంభానికి చర్యలు చేపట్టారు. అయితే డీఎఫ్ఓ బదిలీతో ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకోనున్నా విఘ్నేష్ ఆ స్థాయిలో స్పందిస్తారా లేదా అన్నది తెలియాలంటే సిబ్బంది వేచి చూడాల్సిందే.

నాణ్యమైన సేవలే లక్ష్యం

- వేసవిలో ప్రణాళికాబద్ధంగా విద్యుత్ సరఫరా
- ఏ సమస్యకైనా 1912కు ఫిర్యాదు చేయండి
- విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్



ఇంటర్వ్యూ interview

అనంతపురంరూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ పేర్కొన్నారు. వేసవి నేపథ్యంలో ప్రణాళికబద్ధంగా విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. విద్యుత్‌కు సంబంధించి ఏ సమస్య ఎదురైనా ఏపీఎస్పీడీసీఎల్ టోల్‌ఫ్రీ నంబరు 1912కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. వేసవి నేపథ్యంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి.. ఎన్ని ఫీడర్ల ద్వారా వినియోగం జరుగుతోంది?

జవాబు: జిల్లా వ్యాప్తంగా గృహ కనెక్షన్లు 6.17 లక్షలు ఉన్నాయి. వీటితోపాటు కమర్షియల్, ఇండస్ట్రీస్, ప్రభుత్వ, వ్యవసాయ, ఇతర కనెక్షన్లు 2.72 లక్షలు ఉన్నాయి. వీటన్నింటికీ 707 ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతోంది.

ప్రశ్న: జిల్లాలో రోజువారి విద్యుత్ వినియోగం ఎంత ఉంటోంది..?

జవాబు: వేసవి కాలం ప్రారంభమైంది. రోజువారి వినియోగం బాగా పెరిగింది. జిల్లాకు 11.857 మిలియన్ యూనిట్లు కేటాయింపులు ఉన్నాయి. ప్రస్తుతం రోజు వారిగా 11.650 మిలియన్ యూనిట్లు వినియోగమవుతోంది. వచ్చే నెల నుంచి 13.5 మిలియన్ యూనిట్లు వినియోగం జరిగే అవకాశం ఉందని అంచనా వేశాం. అందుకు అనుగుణంగా సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: వ్యవసాయానికి ఏ విధంగా సరఫరా చేస్తున్నారు..?

జవాబు: జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కనెక్షన్లు 1.84 లక్షలు ఉన్నాయి. 491 ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. నీటి సమస్యలేని 89 ఫీడర్లలో 9 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నాం. మిగిలిన 402 ఫీడర్లలో రైతుల విజ్ఞప్తి మేరకు రెండు విడతల్లో సరఫరా చేస్తున్నాం. పగటి వేళల్లో 5 గంటలు, రాత్రి వేళల్లో 4 గంటల సరఫరా చేస్తున్నాం.

ప్రశ్న: వేసవిలో ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలను అధిగమించేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు.?

జవాబు: వేసవిలో ఓవర్‌లోడు కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు ఎక్కువగా తలెత్తే అవకాశం ఉంది. మరమ్మతులకు గురైన వెంటనే క్షేత్రస్థాయిలో లైన్‌మెన్, మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయాలి. పట్టణ ప్రాంతాల్లో 24 గంటల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లో ట్రాన్స్‌ఫార్మర్ మార్చాల్సి ఉంటుంది. అధికారుల నుంచి స్పందన లేకపోతే టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.


ప్రశ్న: విద్యుత్ సరఫరాలో అంతరాయాలను అధిగమించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు: వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తుంటాయి. లోఓల్టేజీ, హైఓల్టేజీ వంటి సమస్యలు వస్తుంటాయి. సమస్య ఎక్కువగా ఉన్నప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. అవసరం మేరకు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తాం.

నేడే ఆంధ్రజ్యోతి లక్కీడ్రా

అనంతపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి యాజమాన్యం పాఠకుల కోసం కార్ అండ్ బైక్‌రేస్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా (అనంతపురం యూనిట్) స్థాయిలో విజేతల ఎంపిక కోసం మంగళవారం లక్కీడ్రా నిర్వహించనుంది. ఆంధ్రజ్యోతి అనంతపురం యూనిట్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు కార్యక్రమం ఉంటుంది. ముఖ్యఅతిథుల ద్వారా ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలతోపాటు వందమంది ప్రోత్సాహక బహుమతులకు విజేతలను ఎంపిక చేస్తారు. 2024 నవంబరు నుంచి 2025 ఫిబ్రవరి వరకు ప్రతినెలా మూడు చొప్పున నాలుగు నెలలకు 12కూపన్లు ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురించారు. ఒక్కొక్క నెల కూపన్లు ఒక సెట్టుగా నాలుగు నెలలకు నాలుగు సెట్ల కూపన్లు పాఠకులు ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో అందజేశారు. పాఠకులు పంపిన వేలాది కూపన్ల నుంచి మొదటి బహుమతి బైక్, ద్వితీయ బహుమతి రిఫ్రిజిరేటర్, తృతీయ బహుమతి కలర్ టీవీ, వంద మందికి కన్సొలేషన్ బహుమతులు ఇస్తారు. అదేవిధంగా త్వరలో నిర్వహించే ఏపీ రాష్ట్ర స్థాయి లక్కీడ్రాలో బంపర్ బహుమతిగా కారు గెలుచుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం 11 గంటలకు కక్కలపల్లి క్రాస్ సమీపంలోని అనంతపురం ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో నిర్వహించే లక్కీడ్రాకు పాఠకులందరూ ఆహ్వానితులే.

ఖాద్రీశుడి హుండీ ఆదాయం రూ.82.64 లక్షలు



కదిరి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 15రోజులు బ్రహ్మోత్సవాల సందర్భంగా రూ.82,64,892లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. 12 గ్రా. బంగారం, 302 గ్రా. వెండి వచ్చిందన్నారు. 21 అమెరికన్ డాలర్లు, 20 కెనడా డాలర్లు, ఆస్ట్రేలియా 20 డాలర్లతోపాటు ఒమన్ కరెన్సీ 7 రియాలు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో హుండీ లెక్కింపు పర్యవేక్షణాధికారి ఎన్ ప్రసాద్, కెనరాబ్యాంక్ మేనేజర్ అనంతబాబు, పలువురు సిబ్బంది ఉన్నారు.

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య


రాజేశ్వరి (ఫైల్)

గాండ్లపెంట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూపల్లి పంచాయతీ వంకపల్లి గ్రామంలో భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ సోమవారం ఆత్మహత్య చేసుకుంది. రాజేశ్వరి (29) వేపరాల సచివాలయంలో హార్టికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేసేది. పది సంవత్సరాల క్రితం వంకపల్లికి చెందిన ఈశ్వర్‌రెడ్డితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. వంకపల్లిలో ఉంటూ వేపరాల సచివాలయంలో విధులు నిర్వహించేది. కొద్ది రోజుల నుంచి రాజేశ్వరిని ఈశ్వర్ రెడ్డి వేధించేవాడు. ఆ వేధింపులు తాళలేక ఆమె తన ఇంట్లో సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇన్‌చార్జ్ ఎస్‌ఐ వలీబాషా సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజేశ్వరి తల్లి రామసుబ్బమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మహిళ అదృశ్యం


రూప

ధర్మవరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక రాంనగర్‌కు చెందిన రూప కనిపించలేదని అత్త రమణమ్మ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోమందేపల్లికి చెందిన గురురాజు, రూప దంపతులు మగ్గం నేసుకుంటూ జీవనం సాగించేవారు. ధర్మవరానికి వారం రోజుల క్రితం వలస వచ్చారు. మగ్గం నేస్తుండేవారు. దంపతుల మధ్య చిన్నపాటి గొడవలు జరుగుతుండేవి. దీంతో మనస్తాపం చెందిన రూప ఈనెల 14వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో రూప అత్త రమణమ్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీటెక్ విద్యార్థిని..

బత్తలపల్లి, మార్చి24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థిని కనిపించకుండా పోయింది. ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విద్యార్థిని అనంతపురంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. వారం రోజుల క్రితం కాలేజీకి సెలవులు ఉన్నాయని ఇంటికి వచ్చింది. ఈనెల 22వ తేదీన సాయంత్రం 5 గంటల సమయంలో ఆధార్ అప్‌డేట్ చేయించుకుని వస్తానని చెప్పి బయటకు వెళ్లిన విద్యార్థిని రాత్రయినా తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు విద్యార్థిని తండ్రి ఫిర్యాదు చేశారు.

పోలీస్‌స్టేషన్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

తాడిపత్రి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): యల్లనూరు మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో రవికుమార్‌రెడ్డి అనే వ్యక్తి సోమవారం సూపర్‌వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. యల్లనూరు మండలం తిమ్మంపల్లి గ్రామంలో రవికుమార్‌రెడ్డి బెల్ట్‌షాపు నిర్వహించేవాడు. అయితే రెండురోజులక్రితం అతను ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తూ.. ప్రమాదవశాత్తూ వేరే ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో బాధిత వ్యక్తి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఆ విషయంపై యల్లనూరు పోలీసులు రవికుమార్‌రెడ్డికి ఫోన్‌చేసి స్టేషన్‌కు పిలిపించారు. అయితే ఏమైనా పాత కేసులకు సంబంధించి విచారిస్తారన్న భయంతో అతను స్టేషన్‌లో వెంట తెచ్చుకున్న సూపర్‌వాస్మోల్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే పోలీసులు తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


సుంకన్న(ఫైల్)

విడపనకల్లు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు గ్రామంలో విద్యుదాఘాతంతో హెచ్ సుంకన్న(25) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పాల్తూరుకు చెందిన హెచ్ గంగన్న కుమారుడు సుంకన్న సోమవారం మధ్యాహ్నం ఇంటి ముందు తాగు నీటి కోసం మోటార్‌ను ఆన్ చేసేందుకు వెళ్లాడు. స్విచ్ వేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామానికి చెందిన ప్రమీలమ్మతో మూడేళ్లక్రితం వివాహమైంది. ఆమె నెలరోజుల క్రితం తన పుట్టింటిలో ఇద్దరు కవల పిల్లలకు జన్మనిచ్చింది. ఇంతలోనే భర్త మృతి చెందటంతో ఆ కుటుంబం విషాదంలో మునిగింది.

యాచకురాలికి తీవ్రగాయాలు

గుత్తి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో విద్యుదాఘాతంతో అలహాబాద్‌కు చెందిన గన్వి అనే మహిళ తీవ్రంగా గాయపడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఆమెకు మతిస్థిమితం సరిగా లేదని, రైల్వే స్టేషన్ వద్ద భిక్షాటన చేసుకుంటూ ఉండేదని అన్నారు. సోమవారం ఆగి ఉన్న గూడ్సు రైలు బోగిపైకి ఎక్కేందుకు ప్రయత్నించిందని, పైన హైటెన్షన్ విద్యుత్ తీగలు వల్ల విద్యుదాఘాతానికి గురై కిందపడిందని తెలిపారు. దీంతో వెంటనే 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భర్తకు పదేళ్ల జైలు

పుట్టపర్తి రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగారిపల్లికి చెందిన గాయత్రిపై జరిగిన హత్యాయత్నం కేసులో ఆమె భర్త చాకలి రాజశేఖర్‌కు కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. వెంకటగారిపల్లికి చెందిన గాయత్రిపై ఆమె భర్త అనుమానంతో వేధించేవాడు. వీటిని తాళలేక గాయత్రి పుట్టింటికి వెళ్లిపోయింది. రోజులు గడిచినా ఆమె రాకపోవడంతో 2017 అక్టోబరు 11న వెంకటగారిపల్లి క్రాస్‌లో గాయత్రిపై కత్తితో దాడి చేశాడు. 2017 అక్టోబరు 12న నాటి పుట్టపర్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ వారు నేరాన్ని సాక్షాధారాలతో నిరూపించారు. దీంతో అనంతపురం జిల్లా 4వకోర్టు న్యాయమూర్తి శోభారాణి ముద్దాయికి జైలు శిక్షతో పాటు రూ. ఐదు వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారు.

కాలువలో పడి పదో తరగతి విద్యార్థి మృతి


విశ్వతేజ(ఫైల్)

అనంతపురం క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి ఈతకెళ్లిన పదో తరగతి విద్యార్థి మృతి చెందాడు. అనంతపురం రూరల్ మండలంలో సోమవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. మండ్ల సుబ్బారెడ్డినగర్‌కు చెందిన మంజుల ఎర్రిస్వామి కుమారుడు విశ్వతేజ(16) నగరంలోని నాలుగోరోడ్డుకు చెందిన నేతాజీ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. సోమవారం పరీక్ష రాసిన అనంతరం తన స్నేహితులు ప్రభాస్, శశాంక్, ఆచారిలో కలిసి బీఎస్‌ఆర్ కాలనీలో అక్కమ్మ గారి గుడి సమీపంలో చెక్‌డ్యామ్‌లో ఈతకు వెళ్లారు. అందరూ నీటిలో దిగారు. 4.30గంటల సమయంలో విశ్వతేజ నీటిలో మునిగిపోయి, మృతిచెందాడు. అనంతపురం రూరల్ సీఐ శేఖర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తేజకు ఈత సరిగా రాదని స్నేహితులు చెప్పినట్లు తెలుస్తోంది. విశ్వతేజ మృతిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఆత్మహత్యకు యత్నించి జిల్లా సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న రైతులను పరామర్శిస్తున్న మంత్రి సవిత

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

రైతులకు మంత్రి సవిత భరోసా

(5వ పేజీ తరువాయి)

విజ్ఞప్తి చేశారు. రైతులకు జరిగిన నష్టంపై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలుసుకున్నారని అన్నారు. ఇంత నష్టం జరిగినా మాజీ సీఎం జగన్ పరిశీలనకు రాలేదని, ఆయనకు రైతులపై ఏమాత్రం అభిమానం లేదని విమర్శించారు. రైతులకు డ్రిప్ పరికరాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఇవ్వలేని జగన్ రైతు ద్రోహి అని మండిపడ్డారు.

ఆస్పత్రిలో పరామర్శ

అరటి పంట ధ్వంసం కావడంతో ఆత్మహత్యకు యత్నించిన నీర్జాంపల్లి రైతులు లక్ష్మీనారాయణ, చిన్నవెంగన్నను జిల్లా సర్వజన వైద్యశాలలో మంత్రి పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందని ఆరా తీశారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ, ఆర్డీఓ కేశవనాయుడుతో కలిసి ఆమె ఆస్పత్రికి వెళ్లారు. డాక్టర్లు బాగా చూస్తున్నారా అని అడిగారు. భయపడవద్దని, ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. రైతుల ఆరోగ్యస్థితి గురించి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ హేమలతను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలన్నారు.

ఆదుకోవాలి: రాంభూపాల్


వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్‌కు వినతి పత్రం ఇస్తున్న రాంభూపాల్

అనంతపురం కల్చరల్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గాలివానతో నష్టపోయిన ఉద్యాన రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబుతో కలిసి వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్‌కు సోమవారం ఆయన వినతి పత్రం సమర్పించారు. రెండు రోజులుగా ఉమ్మడి జిల్లాతోపాటు కడప, అన్నమయ్య జిల్లాల్లో ఈదురుగాలులు, వడగండ్ల వర్షాల వల్ల ఉద్యాన తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని వివరించారు. తాడిపత్రి, శింగనమల, ధర్మవరం నియోజకవర్గాల్లో ఎక్కువ నష్టం జరిగిందని తెలిపారు. శింగనమల, పామిడి మండలాల్లో మునగ, దానిమ్మ, బొప్పాయి తోటలకు కూడా తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. పంట నష్టపరిహారం చెల్లింపులో వాస్తవ సాగుదారులైన కౌలురైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు.

రుణాలను రద్దు చేయండి: సీపీఎం


ఆత్మహత్యకు యత్నించిన రైతును పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

వడగండ్ల వానతో నష్టపోయిన అరటి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండ్ చేశారు. ఆత్మహత్యకు యత్నించిన నీర్జాంపల్లి రైతులను ఆస్పత్రిలో ఆయన పరామర్శించారు. పుట్లూరు, శింగనమల, యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో రెండు వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉద్యాన పంటలు నేలకొరిగాయని అన్నారు. అరటి, బొప్పాయి, మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. బాధితులలో కౌలు రైతులు కూడా ఉన్నారని అన్నారు. ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టారని అన్నారు. ప్రభుత్వం సకాలంలో పరిహారం ఇవ్వాలని, బ్యాంకు రుణాలను రద్దు చేయాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, రామిరెడ్డి, బీహెచ్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.


దెబ్బతిన్న అరటితోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ

భూమిరెడ్డి పరామర్శ

తాడిపత్రి: ఆత్మహత్యకు యత్నించిన రైతులు లక్ష్మీనారాయణ, చిన్న వెంగప్ప కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. బాధిత రైతుల ఇళ్లవద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సీఎం చంద్రబాబుతో మాట్లాడి, కొత్త పంట వేసుకొనేందుకు ఉచితంగా అరటి మొక్కలను ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నష్టపోయిన అరటితోటలను పరిశీలించారు.

పరిహారం ఇవ్వాలి: రామకృష్ణ


రైతును పరామర్శిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అకాల వర్షాలకు అరటి పంటదెబ్బతినిందని ఆవేదనతో పురుగుల ఆత్మహత్యకు యత్నించిన రైతులను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ పరామర్శించారు. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీనారాయణ, చిన్నవెంగప్పను పార్టీ నాయకులతో కలిసి సోమవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారంకాదని, ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పంటలు నేలపాలుకావడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతులు ఆత్మహత్యకు యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పంట నష్టం అంచనా వేయించి రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శులు జాఫర్, వేమయ్య యాదవ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి: అనంత

అనంతపురం క్రైం: ఈదురు గాలులతో పంటలు నష్టపోయిన ఉద్యాన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో అరటి, మొక్కజొన్న, దానిమ్మ, బొప్పాయి తదితర పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారిక సమాచారం మేరకే రూ.35కోట్లకు పైగా నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. యల్లనూరు, పుట్లూరు, పెద్దవడుగూరు, యాడికి, శింగనమల మండలాల పరిధిలో పంటలు చేతికొచ్చే సమయంలో నష్టం జరగడం బాధాకరమని అన్నారు. ఫిబ్రవరిలో అరటి టన్ను ధర రూ.25వేలు ఉన్నిందని, ప్రస్తుతం పూర్తిగా పడిపోయిందని, పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని అన్నారు. అధికార యంత్రాంగం సమగ్రంగా నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకునేలా ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. అరటి రైతులు ఆత్మహత్యకు యత్నించడం బాధాకరమని పేర్కొన్నారు.

పరిశీలించిన అధికారులు

తాడిమర్రి: మండల పరిధిలోని నాయనపల్లి, తురకవారిపల్లి, దాడితోట గ్రామాలలో ఈదురుగాలులకు దెబ్బతిన్న ఉద్యాన పంటలను ధర్మవరం హార్టికల్చర్ అధికారి అమరేశ్వరి సోమవారం పరిశీలించారు. రెవెన్యూ అధికారులతో కలిసి పంట నష్టపోయిన రైతుల వివరాలను నమోదు చేసుకున్నారు. రెండు రోజుల్లో ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు. వీహెచ్ఏ రామాంజినేయులు, వీఆర్ఓ కన్నప్ప పాల్గొన్నారు.


దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

ఉదిరిపికొండలో హై వోల్టేజీ విద్యుత్ సరఫరా

పలు ఇళ్లలో కాలిపోయిన విద్యుత్ పరికరాలు

కూడేరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉదిరిపికొండ గ్రామ సమీపంలోని కొత్తకాలనీలో ఇళ్లకు హై వోల్టేజీ విద్యుత్ సరఫరా కావడంతో టీవీలు, బల్బులు, ఫ్యాన్లు, ఫ్రిడ్జ్‌లు కాలిపోయాయి. సోమవారం తెల్లవారుజామున బల్బులు పగలడం, ఫ్యాన్లు కాలిపోవడం, టీవీలు , ఫ్రిడ్జిలు పేలడంతో పెద్ద ఎత్తున శబ్దాలు వచ్చాయి. దీంతో జనం ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. కొందరు ఇళ్ల గోడలకు కరెంటు సరఫరా కావడంతో వణికిపోయారు. కాలనీకి విద్యుత్‌ను సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌కు భూమికి ఎర్త్ లేకపోవడంతో హైవోల్టేజీ కరెంట్ వస్తోందని స్థానికులు తెలిపారు. ఈ సమస్యను కరెంటు అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని మండిపడ్డారు. అధికారుల నిర్లక్ష్యంతో ఇలా జరుగుతోందని వాపోయారు. హైవోల్టేజీతో పలువురి ఇళ్లలో విద్యుత్ పరికరాలు కాలిపోయాయని, ఎవరికీ ఎలాంటి ప్రమాదం లేదని ఊపిరి పీల్చుకున్నారు.

టీడీపీ నాయకుడిపై దాడి

అనంతపురం క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని మదర్‌థెరిస్సా కాలనీలో మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడిపై సోమవారం దాడి జరిగింది. రాప్తాడు మండలం గాండ్లపర్తి కొత్తపల్లికి చెందిన మోహన్‌రెడ్డి గత నాలుగు నెలలుగా మదర్‌థెరిస్సా కాలనీలో నివాసముంటున్నాడు. ఈయన ఆత్మకూరు మండలం వడ్డుపల్లిలో పెళ్లి చేసుకున్నారు. ఆ గ్రామంలో అన్నదమ్ములైన దివాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి సాగు చేసుకుంటున్న భూమిలో కొంత భాగం మాల స్వరూప్‌ది అని తెలిసింది. ఈక్రమంలో మోహన్‌రెడ్డి స్నేహితుడు ఫణీంద్రచౌదరి కొంతకాలం కిందట ఆ భూమిలో 26సెంట్లు కొనుగోలు చేశాడు. ఈనేపథ్యంలో వివాదం ఏర్పడింది. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల విషయం, కలెక్టరేట్‌లో అర్జీలు ఇచ్చే విషయంగా మోహన్‌రెడ్డి చొరవ చూపాడు. ఈ వివాదంలో జోక్యం చేసుకుంటే ఇబ్బంది పడతావని అన్నదమ్ములు మోహన్‌రెడ్డిని హెచ్చరించారు. ఆ హెచ్చరికలను ఆయన పెడచెవిన పెట్టడంతో అన్నదమ్మిలిద్దరూ మోహన్‌రెడ్డి ఇంట్లో చొరబడి దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన మోహన్‌రెడ్డిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తగ్గిన చింతపండు ధర

హిందూపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులో చింతపండు ధర తగ్గింది. సోమవారం మార్కెట్‌కు 50 క్వింటాళ్ల చింతపండు వచ్చింది. గత వారంతో పోలిస్తే మేలు రకం చింతపండు క్వింటాల్‌పై రూ.3వేల దాకా తగ్గినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. కర్పూలీ క్వింటాల్‌పై రూ.3 వేల నుంచి 5వేలు తగ్గిందని రైతులు పేర్కొన్నారు. మేలురకం కర్పూలీ క్వింటా రూ.27వేలు, రెండోరకం రూ.12వేలు, మూడో రకం రూ.8వేలు ధరలు పలికాయి. ఫ్లవర్ మొదటి రకం రూ.12,400, రెండోరకం రూ.7వేలు, మూడో రోకం రూ.4250తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి.

12 నుంచి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు

ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన జేసీపీఆర్

తాడిపత్రి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరుకోన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 12వతేదీ నుంచి ఘనంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పట్టణంలోని తన నివాసంలో సోమవారం ఆలయ అర్చకులు, ఈఓ రామాంజనేయులు, కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం అర్చకులు వేదమంత్రాలతో మున్సిపల్ చైర్మన్‌ను, మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తిరుపాల్‌రెడ్డి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న అర్చకులు

పల్లవి ప్రతిభ

షాట్‌పుట్‌లో కాంస్య పతకం కైవసం



అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా జాతీయ స్థాయి పారా క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన నీలం పల్లవి ప్రతిభ చాటింది. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పల్లవి మహిళల షాట్‌పుట్‌లో కాంస్య పతకం సాధించింది. ఇప్పటికే షాట్‌పుట్‌లో జిల్లావాసి సాకే బాబు రజతం కైవసం చేసుకున్నాడు. పతకాలు సాధించిన వారిని కోచ్‌లు అభినందించారు.

అయ్యో..!

ప్రమాదాన్ని చూస్తూ వేగాన్ని తగ్గించిన లారీ డ్రైవర్

వెనుక నుంచి ఢీకొట్టి అదుపుతప్పిన మరో లారీ

డ్రైవర్ మృతి.. ఇద్దరికి గాయాలు

కనగానపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఎదురుగా అవతలి వైపు వస్తున్న వాహనం అదుపుతప్పి గుంతల్లోకి దూసుకుపోతుండడాన్ని చూసి లారీ డ్రైవర్ వేగాన్ని తగ్గించాడు. వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ బలంగా ఢీకొట్టి, అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి, చెట్టును ఢీకొట్టింది. దీంతో ఆ లారీ డ్రైవర్ దుర్మరణం చెందాడు. గుంతలోకి దూసుకెళ్లి వాహనంలోని ఇద్దరు గాయపడ్డారు. మండలంలోని పర్వతదేవరపల్లి వద్ద సోమవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మామిళ్లపల్లి వైపు నుంచి అనంతపురం వైపునకు బొలెరో వాహనం వెళ్తోంది. 44వ జాతీయ రహదారిపై పర్వతదేవరపల్లి వద్దకు వెళ్లగానే అదుపుతప్పి గుంతల్లోకి దూసుకెళ్లి, బోల్తాపడింది. అదే సమయంలో ఎదురుగా అనంతపురం వైపు నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న ఖాళీ లారీ డ్రైవర్ ప్రమాదాన్ని చూస్తూ వేగాన్ని తగ్గించాడు. వెనకాలే వేగంగా వస్తున్న మరో లారీ బలంగా ఢీకొట్టి పక్కనున్న చెట్లలోకి దూసుకెళ్లింది. దీంతో వెనుకవైపు ఢీకొన్న లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుని మృతిచెందాడు. బోల్తాపడిన బొలెరో వాహనంలోని ఇద్దరు గాయపడ్డారు. వారి వివరాలు తెలియాల్సి ఉంది. కనగానపల్లి ఎస్‌ఐ మహ్మద్ రిజ్వాన్ ప్రమాద స్థలాన్ని పరిశీలించి, క్యాబిన్‌లో ఇరుక్కున్న లారీ డ్రైవర్ మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడు నంద్యాల జిల్లా బనగానపల్లి మండలం పెద్దరాసుపాళ్యం గ్రామానికి చెందిన ప్రసాద్(38)గా గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రసాద్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

న్యూస్ బాక్స్

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న మాజీ మేయర్ స్వరూప

అనంతపురం అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మాజీ మేయర్ స్వరూప అన్నారు. సోమవారం స్థానిక 41వ డివిజన్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద పీ-4 సర్వేపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మేయర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ మాట్లాడారు. ఈ సర్వే ద్వారా పేదలను గుర్తించి, ఎన్ఆర్ఐ, ధనవంతుల సహకారంతో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సీఎం చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారన్నారు. అనంతరం 39వ డివిజన్ పరిధిలోని సచివాలయాల్లో సోమవారం పీ-4 సర్వేపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బెస్త సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ చేపల హరి, సచివాలయ సిబ్బందితో కలిసి పీ-4 సర్వే పోస్టర్లను ఆవిష్కరించారు.

ఈద్గా మైదానంలో ప్రత్యేక ఏర్పాట్లు



ఈద్గా మైదానాన్ని శుభ్రం చేయిస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం కల్చరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకుని ఈద్గా మైదానాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ నగరపాలకసంస్థ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ సమక్షంలో డ్రైవర్స్ కాలనీలోని ఈద్గా మైదానంలో ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేయించడంతోపాటు ఎండిపోయిన చెట్లను తొలగించారు. ముస్లింలు వజూ చేసుకోవడానికి నీటి వసతి కల్పించడంతోపాటు ముందుజాగ్రత్తగా మైదానం వద్ద అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. టీడీపీ నాయకుడు మణికంఠబాబు, మైనార్టీ నాయకులు జేఎం బాషా, సైఫుద్దీన్, రజాక్, ఖలందర్, మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యుడు మున్వర్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్‌కు అంతర్జాతీయ స్థాయిలో ఆదరణ

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ఆదరణ ఉన్న క్రీడ ఫుట్‌బాల్ అని రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఏపీ సూపర్ ఫుట్‌బాల్ కప్-2025 పోటీలు ఐదో రోజు కొనసాగాయి. లీగ్ పోటీల్లో నల్లమలపై వంశధార 5గోల్స్ తేడాతో, పెన్నాపై గోదావరి 4గోల్స్, కోరమాండల్‌పై విశాఖ 2గోల్స్, తుంగభద్రపై కొల్లేరు 9గోల్స్ తేడాతో విజయం సాధించాయి. వరుసగా ఐదు విజయాలు సాధించిన కొల్లేరుక్లబ్ జట్టు 15పాయింట్లతో జాబితాలో మొదటి స్థానంలో, గోదావరి 12పాయింట్లతో ద్వితీయ స్థానంలో కొనసాగుతున్నాయి. ప్రతిభగల క్రీడాకారులకు ఇలాంటి వేదికలు ఎంతగానో ఉపకరిస్తాయని డీఎస్పీ అన్నారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సరిపూటి వేణుగోపాల్, సభ్యులు, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రెస్టారెంట్ల తనిఖీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆలియా అరేబియన్ రెస్టారెంట్, శ్రీ వెంకటేశ్వర ఓళిగ, బజ్జీ సెంటర్‌లలో ఆహారభద్రత శాఖాధికారులు తనిఖీలు నిర్వహించారు. సోమవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీమ్ ఆధ్వర్యంలో ఆ శాఖ సిబ్బంది తనిఖీలు చేశారు. ముందుగా రామ్‌నగర్‌లోని ఆలియా అరేబియన్ రెస్టారెంట్‌లో అనుమానితంగా ఉన్న చికెన్ బిర్యానినీ, కమలానగర్‌లోని శ్రీవెంకటేశ్వర ఓళిగ, బజ్జీ సెంటర్‌లో పిండి పదార్థాలను శాంపిల్స్ తీసుకొని ల్యాబ్‌కు పంపించారు.

గ్రీవెన్స్‌లో 419 ఫిర్యాదులు

అనంతపురం టౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 419 మంది బాధితులు తరలివచ్చి తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని వినతులు ఇచ్చారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డీఆర్వో మలోల, డిప్యూటీ కలెక్టర్లు రామక్రిష్ణారెడ్డి, తిప్పేనాయక్, ఆనంద్, రామమోహన్, పౌరసరఫరాల శాఖ డీఎం రమేష్‌రెడ్డి బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. తమ భూములను ఆక్రమించుకోవడానికి ఓ నాయకుడి కుమారుడు ప్రయత్నిస్తున్నాడని రాయదుర్గం మండలం రేకులకుంట గ్రామానికి చెందిన కొందరు రైతులు కలెక్టర్‌తో మొరపెట్టుకున్నారు.

మీటర్ రీడర్స్‌ను ఆదుకోండి : ఏఐటీయూసీ

స్మార్ట్‌మీటర్లను తీసుకొచ్చి మీటర్‌రీడర్స్‌ను ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం తొలుత బాధిత మీటర్‌రీడర్స్‌తో కలిసి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మను కలిశారు. వారు మాట్లాడుతూ.. ఎన్నోఏళ్లుగా మీటర్‌రీడర్స్‌గా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నామని అన్నారు. ఇపుడు స్మార్ట్‌మీటర్ల పేరుతో రోడ్డునపడేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్‌శాఖలోనే ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆదుకోవాలని వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రాజేష్‌గౌడ్, క్రిష్ణుడు, మీటర్ రీడర్స్ రమేష్, రామ భీమప్ప, సలీమ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనపై ర్యాలీ

అనంతపురం టౌన్, మార్చి24(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల, సర్వజనాస్పత్రి ఆధ్వర్యంలో క్షయవ్యాధి నిర్మూలనపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల వద్ద సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు ర్యాలీని ప్రారంభించారు. అక్కడి నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. ఆస్పత్రి ఎదుట మానవహారం నిర్వహించారు. ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, వైద్య కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ షారోన్ సోనియా, వైద్యులు షంషాద్ బేగం, సరళ, శ్రీధర్, రామస్వామి, శంకర్, పరదేశినాయుడు, మెడికోలు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ సేవారత్న అవార్డుకు ఎంపిక

అనంతపురం సెంట్రల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధికార ప్రతినిధి డాక్టర్ అక్కులప్ప ఉగాది జాతీయ ఉత్తమ సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం సర్వజ మందిర్ సేవాసొసైటీ ఎంపిక పత్రాన్ని పంపినట్లు అక్కులప్ప ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ సేవారత్నకు ఎంపిక వడం ఆనందంగావుందని ఆయన తెలిపారు.

విమానాశ్రయం వద్దు.. భూములే కావాలి..

ఇన్‌చార్జి కలెక్టర్‌కు తలుపూరు రైతుల వినతి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న తలుపూరు రైతులు

అనంతపురం టౌన్, మార్చి24(ఆంధ్రజ్యోతి): మాకు విమానశ్రం వద్దు.. మాభూములే కావాలంటూ ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణశర్మకు రైతులు విన్నవించారు. ఇటీవల కూడేరు ప్రాంతంలో ఎయిర్‌పోర్ట్ వస్తుందని, ఇందుకు అధికారులు భూములు గుర్తిస్తున్నారని, మీడియా, సోషల్ మీడియాలలో పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. సోమవారం ఆత్మకూరు మండలం తలుపూరు గ్రామానికి చెందిన రైతులు జిల్లా కలెక్టరేట్‌వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్‌ను గ్రీవెన్స్‌లో కలిశారు. రైతులు మాట్లాడుతూ మాపొలాల్లో ఎయిర్‌పోర్టు వస్తుందంటున్నారు, విమానశ్రయం వద్దు, మాభూములే కావాలని డిమాండ్ చేశారు. మేము విమానంలో పోయేవాళ్లం కాదని, ఇక్కడే పొలం పనులు చేసుకుని బతుకుతున్నామన్నారు. తులం బంగారం కూడా కొనలేని స్థితిలో ఉన్నామన్నారు. మరోవైపు ఈ పొలాల్లో బోర్లు కూడా అధికంగా ఉన్నాయని, ఉద్యాన పంటలు ఎక్కువగా సాగుచేస్తున్నామన్నారు. అలాంటి భూములు ఎయిర్‌పోర్టుకు ఇమ్మంటే ఇచ్చేది లేదని, బలవంతం చేస్తే ఆత్మహత్యలే శరణ్యమని అన్నారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

కాలువలోకి ఆటో..!



మురుగు కాలువలో దిగిపోయిన ఆటో

అనంతపురం క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో సోమవారం ఉదయం 8గంటల సమయంలో శ్రీకంఠం సర్కిల్‌లో ఓ ఆటో కాలువలోకి దూకింది. ఓ పెద్దాయన ఆటో నడుపుతూ కాలువలోకి నడిపాడు. అక్కడున్న ట్రాఫిక్ పోలీసులు మద్యం మత్తులో ఆటోను నడిపినట్లు భావించారు. బ్రీత్ ఎనలైజర్‌తో చెక్ చేస్తే మద్యం తీసుకోనట్లు తేలింది. అనారోగ్యంతో ఉన్న ఆ వృద్ధుడు అస్వస్థతకులోనై ఆటోను అలా కాలువలోకి దూకించినట్లు నిర్ధారించారు. ట్రాఫిక్ ఏఎస్ఐ రామచంద్రారెడ్డి, కానిస్టేబుల్ డీఎం బాషా స్థానికుల సాయంతో ఆటోను బయటకు తీశారు. రికార్డులు తీసుకురావాలని డ్రైవర్‌కు సూచించారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తులు

ఆత్మకూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీలో చేరేందుకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఓ నీమారోజ్ కోరారు. 6వ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి తరగతిలో 40 మందిని చేర్చుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ఏప్రిల్ 11వ తేదీ వరకు గడువు ఉందన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

పది పరీక్ష కేంద్రాల తనిఖీ

నార్పల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను సోమవారం ఆర్డీఓ కేశవనాయుడు పరిశీలించారు. విద్యార్థులకు అన్నిసౌకర్యాలు కల్పించారా అని విద్యాధికారులు, హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. మండల విద్యాధికారులు కృష్ణయ్య, నారపరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసమూర్తి, హెచ్ఎంలు రవికుమార్, నాగేష్, వీఆర్వోలు నిరంజన్‌రావు, శివరాం, రామాంజనేయులు పాల్గొన్నారు.

నేడు పోక్సో చట్టంపై అవగాహన

అనంతపురం రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటుకలపల్లి పంచాయతీ చిన్నకుంట ఎస్టీ కాలనీలో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దివాకర్ తెలిపారు. ఉదయం 10గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ హాజరవుతారన్నారు.

టైరు పగిలి.. గొర్రెల వాహనం బోల్తా

గార్లదిన్నె, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామదాసుపేట వద్ద 44వ జాతీయ రహదారిపై సోమవారం టైరు పగిలి గొర్రెను తరలిస్తున్న బొలెరో వాహనం బోల్తా పడింది. స్థానికుల వివరాలు మేరకు కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన వినోద్‌కుమార్, మునిరత్నం, శ్రీనివాసులు, వెంకటేసు, సతీష్ గొర్రెలు తీసుకుని చెన్నైకు వెళుతున్నారు. రామదాసుపేట వద్దకు రాగానే బొలెరో వాహనం టైర్ పగిలి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

ఆత్మకూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు నీళ్ళపాల నాగన్న(60) బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఆయన మృత దేహాన్ని సోమవారం స్వగ్రామం సనపకు తీసవుకువచ్చారు.పలువురు టీడీపీ నాయకులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. నాగన్న మృతికి ఎమ్మెల్యే పరిటాల సునీత ఫోన్ ద్వారా సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మండల ఇన్‌చార్జి బాలాజి, నాయకులు ఎల్ నారాయణ చౌదరి, రామ్మూర్తి నాయుడు, మండల కన్వీనర్ శ్రీనివాసులు, మాజీ కన్వీనర్ వేణుగోపాల్, రాజారమేష్, రఘునాథరెడ్డి, శ్రీనివాస రెడ్డి పరామర్శించిన వారిలో ఉన్నారు.

కుంటిమద్దిలో పోలీసుల తనిఖీలు

రామగిరి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంటిమద్ది గ్రామంలో రామగిరి సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో సోమవారం తెల్లవారుజామున కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. చెన్నేకొత్తపల్లి, రామగిరి పోలీసులతో కలిసి ఆయన ఇరుపార్టీల నాయకులు ఇళ్లలో సోదాలు చేశారు. గడ్డివాములలోనూ, పొలాల్లో సోదాలు చేశారు. గ్రామంలో ప్రశాంతత ఉండాలని, ఎలాంటి కక్షలు, కార్పణ్యాలు పెట్టుకోవద్దని ప్రజలకు సీఐ సూచించారు. ఏ చిన్నగొడవ జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. చెన్నేకొత్తపల్లి ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోండి

బుక్కరాయసముద్రం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పశు బీమాను రైతులు, పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాశాఖ ఏడీ రత్నకుమార్ కోరారు. ఆయన మట్లాడుతూ పశువులు ప్రమాదశాత్తు లేదా వ్యాధిబారిన పడి మరణిస్తే వాటి యజమానులు నష్టపోకుండా ప్రభుత్వం పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. రూ.30 వేల నుంచి లక్ష వరకు బీమా వర్తిస్తుందన్నారు. మండలంలోని బుక్కరాయసముద్రం, కొర్రపాడు పశువైద్యశాలలు, రైతు సేవా కేంద్రాల్లో సంద్రించాలన్నారు.



మాట్లాడుతున్న విశ్రాంత వైస్ చాన్స్‌లర్ వెంకటేశ్వర్లు

అవసరాలకు అనుగుణంగా వ్యవసాయంలో మార్పులు

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితులతో పాటు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ పద్ధతుల్లో మార్పులు చేయాల్సి ఉందని విశ్రాంత వైస్ చాన్సలర్, సీఆర్ఐడీఏ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. గత మూడు రోజులుగా స్వచ్ఛంద సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో కలిసి అనంత సుస్థిర వ్యవసాయ వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న చిరుధాన్యాల మేళా సోమవారం ముగిసింది. ముఖ్య అతిథులుగా హాజరైన విశ్రాంత వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో మార్పులు చేస్తూ, ప్రజల ఆరోగ్యాలను కాపాడాలన్నారు. ముగింపు సందర్భంగా నిర్వాహకులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలతో సత్కరించారు. ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి, వనం ప్రసాద్,వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, నాబార్డు డీడీఎం అనురాధ పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి చేతితో వలిచిన అక్షింతలు



అక్షింతల కోసం వడ్లను వలుస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో సీతారాముల కల్యాణానికి సంప్రదాయ బద్ధంగా చేతులతో వలచిన అక్షింతలనే వినియోగిస్తున్న సంస్కృతికి అనంతపురం మొదటిరోడ్డులో కాశీ విశ్వేశ్వరాలయంలోనూ శ్రీకారం చుట్టారు. సోమవారం వరిమళ్ల వద్ద నుంచి సేకరించిన వడ్లను తీసుకొచ్చి, ఆలయ ఆవరణలో తొలుత రాములవారి చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం ఆలయ సిబ్బందితోపాటు భక్తుల స్వహస్తాలతో వలిచారు. ఇకనుంచి ప్రతియేటా రాములవారి కల్యాణానికి అక్షింతలు సిద్ధం చేసి వినియోగించనున్నట్లు ఈఓ శోభ వెల్లడించారు. ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు బీజే వేణు, నరేంద్రచౌదరి, పరమేష్, భక్తులు పాల్గొన్నారు.

పెరిగిన హుండీ ఆదాయం: మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయ హుండీ ఆదాయం పెరిగింది. ప్రతియేటా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాత హుండీ ఆదాయం లెక్కించడం ఆనవాయితీగా వస్తోంది. సోమవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వన్నూర్‌స్వామి సమక్షంలో ఈఓ శోభ నేతృత్వంలో హుండీలను తెరిచి లెక్కించారు. గతేడాది రూ.7.34 లక్షల ఆదాయం రాగా.. ఈ ఏడాది రూ.8.02 లక్షలు వచ్చింది.

రేపటి నుంచి నగరంలో ఇంటింటి సర్వే

అనంతపురం క్రైం,మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో బుధవారం ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు కమిషనర్ బాలస్వామి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ సర్వే ఇన్ హ్యాబిటేషన్స్ఇన్ అర్బన్ ఏరియాస్(నక్ష) కార్యక్రమం పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతోందన్నారు. ఈ పథకం కింద అర్బన్ ప్రాపర్టీస్‌ను డిజిటలైజేషన్ చేస్తారన్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే నగరపాలికకు కేంద్రం మూడు విడతలలో రూ.30కోట్ల చొప్పున సంబంధిత పురపాలక సంఘానికి ఇన్సెంటివ్‌గా అందజేస్తారన్నారు. సర్వే నిర్వహించడానికి టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. సర్వే బృందాలకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఎంపీడీఓలపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం ప్రెస్‌కబ్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం ద్వారా కేటాయించిన ఎస్సీ నిధులను దుర్వినియోగం చేసిన ఎంపీడీఓలపై చర్యలు తీసుకోవాలని ఎంఈఎఫ్ జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో 'ఎస్సీలపై నిర్లక్ష్యం' పేరిట ప్రచురితమైన కథనంపై ఆయన స్పందిస్తూ.. ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ. 40 శాతానికిపైగా ఎస్సీ ప్రజలున్న గ్రామాల్లో అభివృద్ధి పనులుచేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎంఏజీవై పథకం ద్వారా నిధులు కేటాయిస్తే ఆ నిధులను ఎంపీడీఓలు దుర్వినియోగపరచడం దారుణమన్నారు. అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వహించిన ఎంపీడీఓలను గుర్తించి వెంటనే వారిని సస్పెండ్ చేయాలన్నారు.

అగ్నికి ఆహుతైన లారీ పరిశీలన

గార్లదిన్నె, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మంపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం గోధుమల లారీ అగ్నికి ఆహుతైన విషయం తెలిసిందే. సోమవారం ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషాతో కలసి అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు అగ్నికి ఆహుతైన లారీని పరిశీలించారు. గోధుమల లారీ ఎక్కడి నుంచి వస్తోంది.... ఎక్కడికి వెళుతోంది లారీ నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు.

ఎస్కేయూ విద్యార్థులకు ఉద్యోగాలు



ఎంపికైన విద్యార్థులతో ఇన్‌చార్జి వీసీ అనిత

అనంతపురం సెంట్రల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య పాఠశాలల ఉపాధ్యాయులుగా ఎస్కేయూ విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. ఈ మేరకు సోమవారం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు విద్యార్థులకు నియామక పత్రాలందజేసి అభినందించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో విద్యాసంస్థలున్న శ్రీచైతన్యలో అకడమిక్ టీచర్స్, డీన్స్, ప్రిన్సిపాల్ వంటి పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, గణితం అభ్యసించిన విద్యార్థులతో బీఈడీ విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు చేపట్టామని తెలిపారు. మొత్తం 123మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా ప్రతిభ కనబర్చిన 56మంది ఎంపికయ్యారని, వీరందరికీ నియామక పత్రాలందజేశామని వివరించారు. ఒక్కో విద్యార్థికి నెలకు రూ.21వేల నుంచి రూ.లక్ష వరకు వేతనం చెల్లిస్తారని పేర్కొన్నారు. శ్రీచైతన్య ఏజీఎం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్కేయూ రెక్టార్ వెంకటనాయుడు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.అనిత, ప్రిన్సిపాల్స్ ఇషాద్ వలి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

వాగ్దానాలను అమలు చేయాలి: సీపీఐ

శింగనమల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అయలు చూయాలని, లేని పక్షంలో ఉద్యమాలు తప్పవని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ హెచ్చరించారు. సోమవారం స్థానిక వాసవీ కల్యాణమండపంలో సీపీఐ మండల మహాసభలు నిర్వహించారు.కార్యక్రమానికి జాఫర్‌తో పాటు పాల్యంనారాయణస్వామి, నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, చిన్నప్పయాదవ్ హాజరయ్యారు. మొదట పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. గ్రామంలో ర్యాలీ చేపట్టారు. జాఫర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదని, రైతులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, సూపర్ సిక్స్ పథకాల జాడే లేదన్నారు. మధుయాదవ్, శ్రీనివాసులు, లలితమ్మ, మునిస్వామి, ఓబుళపతి, చంద్ర,రామాసూబ్బారెడ్డి పాల్గొన్నారు. అనంతరం నూతన మండల కమిటీ ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మధుయాదవ్, సహాయ కార్యదర్శిగా నేసె మధు, చికెన్‌బాషాలను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

బాలాజీ విద్యార్థుల ప్రతిభ

అనంతపురంరూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి మేనేజ్మెంట్ మీట్‌లో బాలాజీ కళాశాల ఎంబీఏ(ఎస్‌బీఎల్‌జే) విద్యార్థులు వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచి అవార్డులు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ మన్మథేశ్వరరెడ్డి తెలిపారు. సత్యసాయిజిల్లాలోని సప్తగిరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలల్లో జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ మీట్ నిర్వహించారన్నారు. ఇందులో పవర్ పాయింట్ ప్రజెంటేషన్, బెస్ట్ సెల్ఫీలో రన్నరప్‌గా నిలిచారన్నారు.



విద్యార్థులతో ఎంబీఏ(ఎస్‌బీఎల్‌జే)ప్రిన్సిపాల్ మన్మథేశ్వరరెడ్డి

శ్రీబాలాజీ పీజీ కళాశాల విద్యార్థులు: శ్రీబాలాజీ పీజీ(ఎంబీబిఏ)కళాశాల విద్యార్థులు మేనేజ్‌మెంట్ మీట్‌లో సత్తాచాటినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు తెలిపారు. ఏడీ మార్కెటింగ్, బిజినెస్ క్విజ్‌లో ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచారన్నారు. నగదు ప్రోత్సహక బహుమతితోపాటు ప్రసంశాప్రతాలు అందుకున్నారని తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్, యాజమన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రత్యేక అధికారి శ్రీనివాసులురెడ్డి అభినందించారు. విభాగాధిపతి సునీల్‌కుమార్, అధ్యాపకులు రాఘవేంద్ర, ఆయిషా, మురళీధర్, సుమలత, కీర్తనా, ఎర్రిస్వామి, వేణుగోపాల్‌యాదవ్, ఎంసీఏ విభాగాధిపతి కబీర్ బాషా, ఎంబీఏ విభాగాధిపతి సర్ఫరాజ్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రిన్సిపాల్ సుబ్బారావు, అధ్యాపకులు

జాతర నిర్వహణకు రూ.2 లక్షల అందజేత


నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండగను పురస్కరించుకుని పట్టణంలో నిర్వహించే అక్కమాంబ జాతరకు రూ.2 లక్షలను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులకు సోమవారం ఆయన నగదును అందించారు. తొలుత అక్కమాంబ ఆలయానికి ఎమ్మెల్యే రావడంతో ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అక్కమాంబ అమ్మవారి దర్శనం చేయించి పూజలు చేయించారు. తర్వాత ఎమ్మెల్యే జాతర నిర్వహణకు నగదు అందజేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీ చైర్మన్‌కు, సభ్యులకు సూచించారు. భక్తులు అందజేసే విరాళాలను వృథా చేయకుండా ఆలయ అభివృద్ధికే ఖర్చు చేయాలని చెప్పారు. తర్వాత ఎస్ఆర్‌సీ సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి ఓవరాక్షన్..

పెద్దపప్పూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిక్కేపల్లికి చెందిన వైసీపీ నాయకుడు చిన్ననాగిరెడ్డి సోమవారం ఓవరాక్షన్ చేశారు. టీడీపీ మద్దతుదారుడు జనార్ధన్‌రెడ్డి ఇంటికి వెళ్లే దారిని అతను రాళ్లు , కంచె వేసి మూసివేశాడు. దీంతో జనార్ధన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నాగేంద్రప్రసాద్ ఇరువురినీ మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి తహసీల్దార్ ప్లానింగ్ ప్రకారం న్యాయం చేస్తామని, అప్పటి దాకా ఎటువంటి గొడవలకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. దీంతో వైసీపీ నాయకుడు దారికి వేసిన అడ్డు తీసేసి వస్తానని చెప్పి అక్కడి నుంచి వెళ్లి నేరుగా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. అయితే అక్కడ ఎస్ఐ తనను కొట్టాడని అతను హైడ్రామా చేసినట్లు స్థానికులు తెలిపారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

బెళుగుప్ప, మార్చి 24(ఆంధ్రజ్యోతి): బియ్యం కార్డుదారులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ షర్మిల, సీఎస్‌డీటీ బాషా సోమవారం ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 12,938 రేషన్ కార్డులు ఉండగా.. ఇప్పటివరకు 7022 కార్డులకు ఈకేవైసీ పూర్తి చేశామన్నారు. ప్రభుత్వం నెలాఖరు వరకు గడువు ఇచ్చింద ని, ఈలోగా చేయించుకోవాలని చెప్పా రు. చేయించుకోని వారికి ఏప్రిల్ నుంచి బియ్యం పంపిణీ కావని చెప్పారు.

స్థలం వివాదంలో ఘర్షణ

తాడిపత్రి, మార్చి24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో సోమవారం స్థలం వివాదంలో ఇరువర్గాలకు చెందిన చంద్ర, విజయ్‌తోపాటు కన్న, వినోద్‌లు ఒకరిపై ఒకరు రాళ్లతో దాడులు చేసుకున్నారు. స్థానికులు, పోలీసులు వివరాల ప్రకారం సుంకులమ్మ పాలెంకు చెందిన బాలనాగప్ప, చంద్రకళలు అన్నాచెలెళ్లు. వీరికి నంద్యాలరోడ్డులో మడికయ్యల్లో 30సెంట్ల స్థలం ఉంది. ఆ స్థలం విషయంలో ఇరు కుటుంబాల వారు ఘర్షణకు దిగారు. దీంతో పోలీసులు ఇరువర్గాల వారిని స్టేషన్‌కు తరలించారు.

దాడిచేశారని ఫిర్యాదు

యాడికి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తనపై దాడిచేసి గాయపరిచారని దుశ్యంత్‌నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం ఇద్దరిపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. కమ్మవీధికి చెందిన దుశ్యంత్‌నాయుడుపై అదేకాలనీకి చెందిన వెంకటశివ, అతని భార్య దాడిచేసినట్లు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదుచేసినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ ఏఈ బాధ్యతల స్వీకరణ

కణేకల్లు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండల విద్యుత్ నూతన ఏఈగా శంకర్‌నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉరవకొండలో సబ్ ఇంజినీర్‌గా ఉన్న ఆయన ఏఈగా పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. అతడిని విద్యుత్ సిబ్బంది అభినందించారు.

అవగాహనతో క్షయను అంతం చేద్దాం

● వైద్యుల పిలుపు ● పలు చోట్ల ర్యాలీలు



కళ్యాణదుర్గంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కళ్యాణదుర్గం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే క్షయ వ్యాధిని అంతం చేద్దామంటూ టీబీ యూనిట్ సూపర్‌వైజర్ సత్యనారాయణ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం సందర్భంగా పట్టణంలో సీహెచ్‌సీ సిబ్బంది సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సీహెచ్‌సీ నుంచి టీ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. ఇందులో చేయి చేయి కలుపుదాం...క్షయ వ్యాధిని తరిమికొడదాం అంటూ నినాదాలు చేశారు. టీ సర్కిల్‌లో టీబీ సూపర్‌వైజర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా ఆరునెలల పాటు మందులు వాడితే క్షయ పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. క్షయ వ్యాధి గ్రస్థులకు ప్రభుత్వం పౌష్టికాహారం నిమిత్తం ప్రతి నెలా రూ. 1000 చొప్పున ఆరు నెలల పాటు నగదును అందచేస్తుందని చెప్పారు. అధైర్యపడకుండా మందులు సక్రమంగా వాడుతూ, పౌష్టికాహారం తీసుకుంటే క్షయను జయించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ రాజేష్, ఎన్‌జీవో రాష్ట్ర కార్యదర్శి మాదవ యాదవ్, టీబీ సూపర్‌వైజర్ శివకుమార్, ల్యాబ్ టెక్నీషియన్ సంతోషి, ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, రిడ్స్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

●బొమ్మనహాళ్: మండలంలోని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారి గీతాభార్గవి సిబ్బందితో కలిసి గ్రామంలో క్షయనివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, సీహెచ్ఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

●పెద్దవడుగూరు: మండలకేంద్రంలో డాక్టర్ శ్రీనివాసబాబు సిబ్బంది కలిసి క్షయ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

●రాయదుర్గంరూరల్: పట్టణంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మెర్సీ జ్ఞానసుధ, టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ సిబ్బందితో కలిసి క్షయనివారణపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఆస్పత్రి వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీపురవీధుల గుండా సాగింది. పాత బస్టాండ్ ఆవరణలో మానవహారంగా ఏర్పడి క్షయ నివారణపై ప్రతిజ్ఞ చేశారు. టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ ఎంకే సత్యనారాయణ, టీబీ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ శ్రీకాంత్‌నాయక్, యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ యశ్వంత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

● గుత్తి: పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది క్షయ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎల్లప్ప, వైద్యులు రమ్యశ్రీ, అమర్నాథ్, అయేషా, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కలిసి పనిచేద్దాం: ప్రభుత్వ విప్ కాలవ


చెత్త తరలింపు ట్రాలీలను ప్రారంభిస్తున్న కాలవ

రాయదుర్గం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణ అభివృద్ధికి అందరం కలిసి పనిచేద్దామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన చెత్త తరలింపునకు సంబంధించిన నూతన ట్రాలీలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రాయదుర్గం పట్టణ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఇందుకు పార్టీలకు అతీతంగా అందరూ కలిసి రావాలని కోరారు. టీడీపీ నాయకులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

● పట్టణంలోని ఆత్మకూరు వీధిలో మజ్జిదే అహ్మద్ రజా నిర్వహించిన ఇఫ్తార్‌విందులో కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. ముస్లింల చేత ఉపవాస దీక్షలను విరమింపజేశారు.

ఉగాది ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు టౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీ నుంచి జరిగే ఉగాది ఉత్సవాలకు హాజరు కావాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు ఆలయ ఈఓ వాణి, ఆలయ ధర్మకర్త సుగుణమ్మ ఆహ్వానపత్రిక అందజేశారు. కర్నూలు జిల్లా ఆలూరులో సోమవారం వారు ఎమ్మెల్యేను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఆలయ అధికారులు, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం: ఆర్డీఓ

పుట్లూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలో అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఆర్డీఓ కేశవనాయుడు పేర్కొన్నారు. మడ్డిపల్లి, కుమ్మనమల గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి అరటిపంటలను పరిశీలించారు. నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ శేషారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పాత జీఓను పునరుద్ధరించండి

తాడిపత్రి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కుచట్టం ప్రకారం 6నుంచి 14 ఏళ్ల వయసులోపు పేద పిల్లలకు ఉచిత విద్యను అందించే జీఓను పునరుద్ధరించాలని ఏపీ బీడీ వర్కర్స్ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు ఎంఈఓ-2 రామగోవిందరెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం యూనియన్ కన్వీనర్ ఉమాగౌడ్ మాట్లాడుతూ.. పాత జీవోను పునరుద్ధరించి పేదపిల్లలకు ఉచిత విద్యను అందించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీడీ కార్మికులు నూర్జహాన్, లక్ష్మీకాంతమ్మ, ఇమ్రాన్‌బాషా తదితరులు ఉన్నారు.

కేజీబీవీ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి


రూప, కేజీబీవీ ప్రిన్సిపాల్, కంబదూరు

కంబదూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీలో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రూప సోమవారం ప్రకటనలో తెలిపారు. 6వతరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 సీట్లు, ద్వితీయ సంవత్సరంలో4 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇంటర్‌లో ఎంపీహెచ్ గ్రూప్‌పై ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బాలికలకు మాత్రమే అవకాశం ఉందన్నారు. ఏప్రిల్ 11వతేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, ఆ న్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బడిమానేసిన వారు, అనాథలు, పేద బాలికలకు ప్రాధాన్యత ఉంటుందని అన్నారు.

పుట్లూరు: మండలకేంద్రంలోని కేజీబీవీలో 6వతరగతి ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఓ మాధవి తెలిపారు. 6వ తరగతి, ఇంటర్‌తో పాటు 7, 8, 9, 10వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం కూడా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని అన్నారు.

పెద్దపప్పూరు: మండలంలోని జూటూరు కేజీబీవీలో 6వ తరగతిలో 40సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూప్‌లో 40సీట్లు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ బయమ్మ తెలిపారు. అర్హులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కుక్కల దాడిలో 25 గొర్రెపిల్లల మృతి

కళ్యాణదుర్గం, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారాయణపురం గ్రామంలో సోమవారం కుక్కల దాడిలో 25 గొర్రె పిల్లలు మృతి చెందాయి. బాధితుడు గొల్ల రామచంద్ర తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దగొర్రెలు 100కుపైగా ఉండడంతో వాటిని మేతకోసం గ్రామ సమీపంలోకి తీసుకెళ్లామన్నారు. గొర్రె పిల్లలు 25 ఉండడంతో వాటికి చుట్టూ కంచె ఏర్పాటు చేసి వెళ్లామన్నారు. మధ్యాహ్న సమయంలో నీళ్ల కోసం వచ్చి చూడగా ఆ 25 గొర్రె పిల్లలు మృతి చెంది కనిపించాయన్నారు. గ్రామానికి చెందిన కొన్ని కుక్కలు దాడి చేసి చంపేసినట్లు గుర్తించామన్నారు. దీంతో సుమారు రూ.1.50 లక్షల నష్టం సంభవించిందని వాపోయారు.

యువకుల ఘర్షణ

గుత్తి, మార్చి 24(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆదివారం రాత్రి యువకులు ఘర్షణ పడ్డారు. గత మూడు నెలల క్రితం యోగేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అప్పట్లో ఎస్సీ కాలనీకి చెందిన రాముకు ఆర్థిక సాయం కోరాడు. అతడు ఇవ్వకపోడంతో మనసులో పెట్టుకున్న యోగేష్ బస్టాండ్ సమీపంలో మద్యం తాగి అతడితో గొడవకు దిగాడు. ఈ క్రమంలో మాటామాటా పెరగడంతో అక్కడే ఉన్న హోటల్‌లో కూరగాయల కత్తి, కర్ర తీసుకుని పరస్పరం దాడిచేసుకున్నారు. దీంతో యోగేష్, రాముతో పాటు వారి స్నేహితులు గణేష్, ఎల్లప్ప గాయపడ్డారు. పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. బాధితులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రక్తదాన శిబిరం

యాడికి, మార్చి24(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు నాయకుడు వీకే వెంకట్రామిరెడ్డి 2వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన స్వగ్రామం వేములపాడులో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆయన చిత్రపటం వద్ద పలువురు కమ్యూనిస్టు నాయకులు ఘన నివాళులర్పించారు. తర్వాత 60మంది రక్తదాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

రసాభాసగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

● నిట్టూరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై పలు ఆరోపణలు
● విచారణ చేస్తామన్న అధికారులు

యాడికి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సోమవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక ఆరోపణలు, ప్రత్యారోపణలతో రసాభాసాగా మారింది. ఉపాధి పథకం ద్వారా ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు మండలంలో చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేసింది. ఆ వివరాలను వెల్లడించడానికి సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ప్రజావేదిక నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం నివేదికలను చదివి వినిపించారు. ఈజీఎస్ ద్వారా రూ.8.39కోట్ల వ్యయంతో పనులు జరిగాయని తెలిపారు. సమావేశంలో నిట్టూరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై గ్రామస్థులు పలు ఆరోపణలు చేశారు. జాబ్‌కార్డులు మంజూరు చేయించలేదని, పనులు కల్పించలేదని, మేము పనులకు వెళ్లకపోయిన పనులు చేసినట్లు చూపాడని ఆరోపించారు. ఆ ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని వినతిపత్రం అందజేశారు. ఇవన్నీ రాజకీయకక్షతో ఆరోపణలు చేస్తున్నారని, వీటన్నిటికి తనవద్ద ఆధారాలు ఉన్నాయని ఫీల్డ్ అసిస్టెంట్ అధికారులకు చెప్పడం గమనార్హం. నిట్టూరు గ్రామస్థులు చేసిన ఆరోపణలపై విచారణ చేయిస్తామని అధికారులు తెలిపారు. పంచాయతీరాజ్ ద్వారా చేపట్టిన పనుల్లో రూ.3,27,124 ర్యాటిఫికేషన్‌కు, ఉపాధిహామీ ద్వారా చేపట్టిన పనుల్లో రూ.27వేలు రికవరీకి ఆదేశించినట్లు అధికారులు చెప్పారు. డ్వామా పీడీ సలీంబాషా, ఏపీడీ సుధాకర్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ వెంకట శివారెడ్డి, ఎంపీడీఓ వీరరాజు, ఏపీఓ రమేష్, ఎస్ఆర్పీ లక్ష్మినారాయణ, డీఆర్పీలు పాల్గొన్నారు.

గుండెపోటుతో హెచ్‌ఎం మృతి


మురహరి(ఫైల్)

గుమ్మఘట్ట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి జెడ్పీహైస్కూల్ హెచ్ఎం మురహరి(61) సోమవారం ఉదయం రాయదుర్గం పట్టణంలోని నివాసంలో గుండెనొప్పితో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ కాలవశ్రీనివాసులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యార్థులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మరో మూడునెలలో రిటైర్డ్ కావాల్సి ఉండగా.. అంతలోనే మృతి చెందడం పట్ల తోటి ఉపాధ్యాయులు దిగ్భ్రాంతికి లోనయ్యారు.

కబ్జాదారులను అరెస్టు చేయాలి

ఉరవకొండ,మార్చి24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గాంధీ దళితుల హాస్టల్ స్థలాన్ని కబ్జా చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని దళితులు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. తొలుత అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆందోళనలో భాగంగా అక్కడే వంటావార్పు చేశారు. ఈ ఆందోళనకు సీపీఐ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. గాంధీ దళితుల హాస్టల్ స్థలాన్ని కాపాడుకుందామన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ మహబూబ్‌బాషాకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి మధు, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కౌకుంట్ల రవి, ఎల్లన్న, చాబాల సర్పంచ్ జగదీష్, దళిత సంఘాల, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రకు కేజీబీవీ విద్యార్థినులు

బొమ్మనహాళ్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): విజ్ఞాన విహార యాత్రకు మండల కేంద్రంలోని కేజీబీవీలో 9వ తరగతి చదువుతున్న దివ్య, శృతి ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ కమలమ్మ సోమవారం తెలిపారు. ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన ఇన్‌స్పైర్ మనక్‌లో ఈ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించి విజ్ఞానయాత్రకు ఎంపికయ్యారని చెప్పారు. ఈ నెల 25, 26వ తేదీలలో కుప్పం దగ్గర అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సెంటర్‌కు వెళుతున్నట్లు తెలిపారు.

ఉత్తమ సేవలకు అవార్డు


జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ

కళ్యాణదుర్గం రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం టీబీ యూనిట్ సూపర్‌వైజర్ సత్యనారాయణకు ఉత్తమ అవార్డు దక్కింది. జిల్లాకేంద్రంలో సోమవారం ఆయన జాయింట్ కలెక్టర్ శివనారాయణ చేతుల మీదుగా ఆ అవార్డు అందుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా క్షయవ్యాధి గ్రస్థులకు ఆయన ఉత్తమ సేవలు అందించారు. సేవలను గుర్తించి ప్రభుత్వం అవార్డు ఇచ్చింది ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని సత్యనారాయణ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజ

బెళుగుప్ప, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నగరేశ్వరాలయంలో వెలసిన వాసవీమాత ఆలయంలో సోమవారం ఆర్యవైశ్యులు మండల పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంపై గోపుర కలశాన్ని ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తి కావడంతో ఈ మండల పూజను జరిపించారు. ఈ సందర్భంగా వేదపండితులు వేదమంత్రోచ్చారణలతో వాసవీ అమ్మవారికి హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సకల దేవతల హోమాలు, పూర్ణాహుతి, నగరేశ్వరుడికి, వాసవీమాతకు కుంభాభిషేకాలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాల వినియోగంతో మండల పూజ ముగిసింది.

గవిమఠంలో హుండీల లెక్కింపు

ఉరవకొండ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ ంలో హుండీలను సోమవారం లెక్కించారు. ఏడాది పాటు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకల్ని లెక్కించగా.. రూ.1,78,175ల నగదు, 50గ్రాముల వెండి వచ్చినట్లు పర్యవేక్షణాధికారి విజయ్, గవిమఠం ఏసీ రాణి తెలిపారు. ఉత్తరాధికారి కరిబసవరాజేంద్ర స్వామి, గవిమఠం సిబ్బంది పాల్గొన్నారు.